ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

సంపుటి 02 సంచిక 11 నవంబర్ 2023



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం
4. నెలవారి పంచాంగం
5. మన దేవాలయాలు
6. రామానుజ సుధామాధురి
8. దీపం జ్యోతి పరం బ్రహ్మ-దీపావళి
9. శ్రీపతిస్తుతి
10. శుభాశుభ నిర్ణయాలు-మీమాంస
11. శ్రీమన్నారాయణ ప్రపత్తి
13. జ్యోతిర్విజ్ఞానమ్
14. సందేహాలు-సమాధానాలు
16. భాగవతంలో భగవంతుని కథలు
17. పుస్తక పరిచయం
18. శ్రీభాష్య మంగళాచరణ శ్లోకము
20. అవయవ విభూతి
23. నవరాత్రి ఉత్సవాలు
24. ఆధ్యాత్మిక వార్తలు




## ముఖచిత్ర పరిచయం

చెడుపై మంచి సాధించిన విజయగాధ నరకాసుర వధ. జన్మతహా మంచివారైనా పెడదారులు తొక్కితే కన్నతల్లి కూడా క్షమించదన్నది వాస్తవం. భూదేవి సుతుడైన నరకాసురుడు భూదేవి అంశతో జన్మించిన సత్యభామ చేతిలో కన్నుమూస్తాడు. లోకకంటకుని మృతితో దీపాలు వెలిగించి పండుగ చేసుకుంటారు. చెడు సాంగత్యం వల్ల నరకాసురుడు లోకకంటకుడైనాడు. ఇక్కడ దీపాలు వెలిగించడమంటే విజ్ఞాన జ్యోతులను వెలిగించడమే! నరకచతుర్దశి మరునాడు అమావాస్య అయినా చీకటి వెలుగుల దీపావళి అయింది. మరో విషయం ఇక్కడ మనం గుర్తుంచుకోవాలి. దీపావళి పండుగ రోజునే శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారు జన్మించి మానవాళిలో ఆధ్యాత్మిక జ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్నారు. ఇలా ప్రతియుగంలో దీపావళి రోజు ప్రాధాన్యత తెలిపే అంశాలు ఎన్నెన్నో జరిగాయి. నరకాసుర వధ వృత్తాంతము వెల్లడించే ముఖచిత్రము చిత్రకారుని కుంచెనుంచి జాలువారింది.

(COURTESY FROM ARTIST PAINTING)


### సంపాదక మండలి

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

### గౌరవ సంపాదకులు

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య

శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహాచార్యులు



PUBLISHED BY : డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 878 2253323 ; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం



## పండుగవేళ... స్వదేశీ నినాదం

ఆధునిక యుగంలో అత్యాధునిక పరికరాలతో నిత్యం నూతనమవుతున్న ఈ పరిస్థితులను పునరావలోకనం చేసుకోవాల్సిన అవసరాన్ని ధర్మశాస్త్రం చెబుతోంది. అయితే దానిని అవగాహన చేసుకొని ముందుకు వెళ్లడం అన్న విషయంలోనే ప్రతిబంధకం ఏర్పడుతోంది. ఇక్కడ ఎవరు గొప్ప అన్నది కాదు. ఆచరించే విధానం వల్ల జరుగుతున్న ప్రయోజనం ఏమిటి? అన్న విషయాన్ని పరిశీలన చేసుకోవాలి. పండుగలు వస్తాయి, మామిడి తోరణాలు కడతాం, పూల హారాలు వేస్తాం, పూజలు చేస్తాం, అయితే పరమార్థాన్ని గ్రహించేది లోతుగా అవలోకనం చేసినప్పుడే వాటిలో ఉండే రహస్యాలు మన ఋషులు మనకు అందించిన మన జీవన విధానంతో ముడివడి ఉన్నవే అనే విషయాన్ని మనం గ్రహించడం మంచిది.

పస్తుతం ప్లాస్టిక్ పూలతో కృత్రిమ హారాలతో విదేశీ వస్తువులతో జరుపుకుంటున్నాం. దేశం అభివృద్ధి చెందాలంటే సహజ వనరులు అభివృద్ధి చెందాలి. ఉన్న వనరులను అందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఉదాహరణకు చిన్న విషయమే! నలుగురు కలిసినప్పుడు మనం ఆధునిక ద్రవపదార్థాలను కూల్ డ్రింక్ రూపంలో ఖరీదు చేసి తెచ్చుకుంటాం. గతంలో అయితే ఇంటికి వచ్చిన వారికి మజ్జిగ ఇచ్చేవారు, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. ఇది చిన్న విషయం. అయితే దానివల్ల మన దేశానికి ఎంతవరకు ప్రయోజనం జరుగుతుంది? దేశ ఆర్థిక పరిస్థితికి దీనికి సంబంధం ఏమిటీ అన్న ప్రశ్న ఉదయించవచ్చు. దేశ అభివృద్ధి అంటే మన చుట్టూ ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ వృద్ధి చెందడం అన్నమాట. దీనివల్ల తలసరి ఆదాయం బడుగు బలహీన వర్గాల నుంచి ఉన్నత కుటుంబాల వరకు పెరుగుతుందన్నది వాస్తవం.

ఒక్కక్షణం మనం విదేశీ ఉత్పత్తులను ఉపయోగించడం మానుకుంటే ఎంత బాగుంటుంది. ఆలోచన అయితే బాగుంది కానీ ఆచరణ విషయానికి వస్తే అది సాధ్యం కావడం లేదు. విదేశీ వస్తువులను వాడకుండా ఉండగలమా ఉందామే అనుకోండి దానివల్ల జరిగే ప్రయోజనం మనకు వెంటనే కనిపించకపోవచ్చు. కానీ సదరు వస్తువులు ఉత్పత్తి చేసే వారికి వెంటనే తగు స్పందన కనిపిస్తుంది. ఉత్పత్తులు అమ్ముడు పోకుండా పేరుకు పోతాయి నష్టం కలుగుతుంది. ఎందుకంటే మన దేశంలో కోట్లాది జనాభా ప్రతి పండుగను వేడుకగా నిర్వహిస్తుంది. ఈ వేడుక సందర్భంలో విదేశీ సరుకులు అనబడే వాటిని మనం పరిత్యజించడం ఎంతైనా అవసరం. ఇలా మనం విదేశీ ఉత్పత్తులను బహిష్కరించడం వల్ల స్వయం సమృద్ధి సాధించడానికి అవకాశాలు కలుగుతాయి. ఇక్కడ చాలా విషయాలను మననం చేసుకోవడం మంచిది. ఒకసారి గతంలోకి తొంగి చూద్దాం! స్వాతంత్ర్య ఉద్యమం సమయంలో లాల్ బాల్ పాల్ అనే మాట చాలా వినపడింది ఇది ముగ్గురు వ్యక్తులు వివిధ సందర్భాలలో చేపట్టిన ఉద్యమం వల్లనే. ఆ ముగ్గురు వ్యక్తులు లాలా లజపతి రాయ్, బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్ వీరంతా విదేశీ ఉత్పత్తులను బహిష్కరించాలని ఉద్యమించారు. కానీ ఇది స్వాతంత్రోద్యమ కాలం కాదు. కానీ మనం వాడుతున్న నిత్యం ఉపయోగిస్తున్న వస్తువులలో ఎక్కువ వస్తువులు విదేశాల్లో ఉత్పత్తి అయినవే. అలాంటి వస్తువులు మనం స్వదేశంలో ఉత్పత్తి అయినవి లభిస్తున్న వాటి జోలికి వెళ్లడం లేదు. ముఖ్యంగా చైనాలో ఉత్పత్తి అయిన వస్తువులు బొమ్మలు ఎలక్ట్రానిక్ పరికరాలు ఇతరమైనవి మన మార్కెట్లో విస్తృతంగా అమ్ముడుపోతున్నాయి. దీనివల్ల మనం ఖర్చు పెడుతున్న డబ్బు విదేశాలకు వెళుతుంది. ఈ విషయాన్ని లోతుగా పరిశీలించి కలిగే ఫలితాలను బేరీజు వేసుకోవడం లేదు.

ముఖ్యంగా దీపావళి సందర్భంగా మనం వెలిగిస్తున్న టపాసులు, దీపాలు గతంలో శివకాశిలో తయారైనవి అందుబాటులో ఉండేవి. కానీ నేడు అలా కాదు విదేశాల్లో తయారైనవి కూడా ప్రస్తుతం మార్కెట్లో 60 శాతం పైగా లభిస్తున్నాయి. అయితే వాటిని మనం వాడకుండా ఉండలేకపోతున్నాం. విదేశీ ఉత్పత్తులను ఉపయోగించకుండా ఉంటే దేశ ఆర్థిక పరిస్థితి మరింత ఉన్నతి చెందే అవకాశం ఉంది. ఇలాంటి అవకాశాలను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ ముందుకు వెళ్లడానికి వీలుగా మనకు పూర్వీకులు అందించిన సంస్కృతి సంప్రదాయాలు, నడవడిక ఇత్యాది అంశాలు మనకు ఉపయోగపడతాయి అనడంలో ఎంత మాత్రం సందేహం లేదు. మనదేశంలో ఉత్పత్తి అయిన వస్తువులనే ఉపయోగిద్దాం! ఈ దీపావళి స్వదేశీ నినాదంతో జరుపుకుందాం! ప్రాచీన సాంప్రదాయాలను గౌరవిద్దాం!

–వొద్దిపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

ఆశ్వయుజం మాసం 15-10-23 శుక్లపక్షంతో ప్రారంభమై 13-11-23 వరకు. తదుపరి కార్తీక మాసం

06-11-2023 వరకు స్వాతి కార్తి, 07-11-2023 నుండి 19-11-2023 విశాఖ కార్తి. 20-11-2023 నుండి అనూరాధ కార్తి, **పండుగలు** : 01-11-23 సంకష్టహర చతుర్థి, 09-11-23 సర్వేషాం ఏకాదశి, 12-11-23 నరకచతుర్దశి, దీపావళి, ధనలక్ష్మీ పూజ, 13-11-23 కేదారేశ్వర వ్రతం, 17-11-23 నాగుల చవితి, 23-11-23 సర్వేషాం ఏకాదశి, 27-11-23 కార్తీక పౌర్ణమి.

## మాస ఫలాలు

**మేషం:** ఈనెల అనుకూలంగా ఉండదు. చేయువృత్తి వ్యాపారాలు బాగానే ఉన్నప్పటికి, మనఃస్థిమితం ఉండదు. ఊహించని సంఘటనలు జరుగును.

**వృషభం:** ఈ నెల మిశ్రమ ఫలితాలు ఉంటాయి. ఆరోగ్య సమస్యలు ఉంటాయి. ఖర్చులు అధికం. దైవసంబంధ కార్యాలందు పాల్గొందురు.

**మిథునం:** ఈ నెలయందు చేయు వృత్తి వ్యాపారాలందు రాణింపు. ఆదాయంనకు లోటుండదు. ఆరోగ్యం బాగుండును. గృహనిర్మాణ పనులు చేయుదురు. దైవకార్యాలందు పాల్గొంటారు.

**కర్కాటకం:** ఈ నెలలో కూడా చాలా అనుకూల సమయం. ఆదాయంనకు లోటుండదు. వ్యవహార జయం. ఇతరులు సహకారాలు అందించెదరు. భూసంబంధ వ్యవహారాలు కలిసివచ్చును

**సింహం:** ఈనెల అన్ని విధాలుగా బాగుంటుంది. దైవసందర్శనలు, కుటుంబసౌఖ్యం, ఆదాయంకు ఇబ్బంది ఉండదు. వ్యవహారానుకూలత, ప్రభుత్వ వ్యవహారాలు మీకు అనుకూలం

**కన్య:** ఈనెల బాగుంటుంది. ఆదాయం, ఆరోగ్యం బాగుంటుంది. ముఖ్యమైన సమస్యల నుండి బయటపడుట. వివాహాది శుభకార్యములకు హాజరగుదురు. దైవసంబంధ కార్యాలు చేయుదురు.

**తుల :** ఈనెల మిశ్రమఫలితాలు ఉంటాయి. చేయు వృత్తివ్యాపారాలు బాగానే ఉన్నప్పటికీ ఆశించినంత ఆదాయంరాదు. శుభమూలకంగా ధనవ్యయం. కోపం అధికంగా ఉంటుంది.

**వృశ్చికం:** ఈనెలలో జన్మరాశిలో గ్రహ సంచారం వల్ల శరీరంపై దెబ్బతీయును. స్వల్పంగా ఆరోగ్యభంగాలు. వ్యవహారములు అనుకూలించును. ఆదాయం నకు లోటుండదు.

**మండుటెండలో నడిచెడి వారికి పాదరక్షలు, గొడుగు ఎట్లు ఉపకరించునో అట్లే నవరత్నములు ధరించుటవలన కష్టకాలములు తొలగి సుఖజీవనమునకు సకల సంపదలు కలుగును. ఇట్టి నవరత్నములను పూర్వపు రాజులు సింహాసనము లందునూ, ఆభరణము లందునూ, కిరీటము లందునూ ధరించి జ్ఞానశక్తిని, ఐశ్వర్యమును రాజ్యమును సుఖభోగములను అనుభవించిరి. తెలియక ప్రతికూలమైన రత్నమును ధరించినచో కష్టములు తొలగుటకు బదులు కష్టములు ఎదురగును.**

**ధనుస్సు:** ఈనెల ప్రథమార్థం అన్నిరంగాల వారికి చేయు వృత్తివ్యాపారాలు అనుకూలించును. ఆరోగ్యం బాగుంటుంది. ద్వితీయంలో గ్రహసంచారంవల్ల పనులందు ఆటంకాలు, ఊహించని ఖర్చులు.

**మకరం:** ఈనెల మీ మాటకు ఎదురుండదు. సంఘంలో పేరు ప్రఖ్యాతులు పెరుగును. రాజకీయ నాయకులకు పదవి ఖచ్చితంగా లాభించును. ఉద్యోగులకు ప్రమోషన్ వచ్చును.

**కుంభం:** ఈ నెల అనుకూలంగా ఉన్నందున చేయు వృత్తి వ్యాపారాలు రాణించును. ఆదాయం బాగుండును. ఆరోగ్యలాభము. వాహనలాభం.

**మీనం:** ఈనెల అనుకూలంగా ఉండదు. చేయు వృత్తివ్యాపారాలందు అన్నిరంగముల వారికి వ్యతిరేకమే. దైవసంబంధ కార్యములందు పాల్గొనుట,

## మంచి రోజులివిగో...

**ఈనెల వివాహ, గృహ ఆరంభ, గృహ ప్రవేశ శుభముహూర్తములు 16,19, 23,24,29.**

మన దేవాలయాలు

## శతాబ్దాల చరిత్ర గల జైనథ్ 'లక్ష్మీ నారాయణస్వామి

సేకరణ: శ్రీమాన్ శ్రీ నేరెళ్ల రంగాచార్య అదిలాబాద్.





భారతదేశంలోని దేవాలయాలు చాలా వరకు రాజ నిర్మితాలే! ఇవి వారి వారసత్వ సంపదలుగా నిలిచిపోయాయి. నిర్మించడమే గాక చిరంతరంగా వాటి నిర్వహణ, కైంకర్యాదులకు కొరత ఏర్పడకూడదు అని మడి, మాన్యాలను భూములను ధారా దత్తం చేసి సుస్థిరపరచినారనుటలో అతిశయోక్తి లేదు. ప్రపంచ దేశాల్లోనే భారతదేశం ఒక ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశంగా గుర్తింపు పొందింది. మన సంస్కృతి సాంప్రదాయాలు, సనాతన ధర్మాలు, దేవాలయాలు భారతదేశ ఔన్నత్యాన్ని చాటి చెబుతున్నాయని ప్రపంచ దేశాలు గుర్తించాయి. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోనే ఎన్నో దేవాలయాలు ప్రసిద్ధి పొందాయి. వాటి నిర్మాణ శైలి ప్రకారంగా ఒక్కొక్క ప్రత్యేకతను సంతరించు కున్నాయి. శిల్పకళను బట్టి అది ఏ రాజుల కాలంలో నిర్మింపబడినాయో తెలుస్తుంది.

వెయ్యి సంవత్సరాలకు పూర్వమే భారత దేశంలో అనేక ఆలయాలు నిర్మించబడినాయి. ఈనాటికి చెక్కుచెదరకుండా ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకుంటూ శతాబ్దాల చరిత్రను, కళా నైపుణ్యాన్ని సంతరించుకున్న దేవాలయం జైనథ్ 'లక్ష్మీ నారాయణస్వామి ఆలయం'

అందమైన అడవుల జిల్లాగా, ప్రకృతి సోయగాలతో పరవశించే ఆదిలాబాద్ జిల్లాకే మకుటాయమానముగా ఆధ్యాత్మిక శోభతో నిత్య నూతనంగా విరాజిల్లుతున్నది జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం. జిల్లా కేంద్రానికి సుమారు 18 కిలోమీటర్ల దూరంలో నున్న జైనథ్ దేశ చరిత్రలోనే స్థానం సంపాదించుకున్నది. చారిత్రిక ఆధారాల ప్రకారంగా 8వ మరియు 13వ శతాబ్దాల మధ్య పశ్చిమ చాళుక్యుల కాలంలో నిర్మాణం జరిగి యుంటుందని పరిశోధకులు భావిస్తున్నారు.

అలాంటి ఆధారాలను తెలిపే శాసనము సంస్కృత ప్రాకృత భాషల్లో లభించబడి యుంది. శాసన ప్రారంభంలో "నమః సూర్యాయ" అని ఉండటం స్వామి శిరస్సు ప్రక్కన జ్వాలా చక్రము ఉండటంతో ఇది సూర్యనారాయణ దేవాలయం అని కూడా పిలుస్తుంటారు. ఆశ్వీయుజ, కార్తీక మాసాల్లో స్వామి చరణాలపై సూర్యకిరణాలు సోకడం విశేషం. మూలవిరాట్టు నారాయణ స్వామి విగ్రహం కుడి చేతిలో శంఖం ఎడమ చేతిలో చక్రం మరో కుడి చేతిలో పద్మం ఎడమ చేతిలో గదా ధరించిన దివ్య మంగళ స్వరూపం కన్నుల పండువగా గోచరిస్తుంది.

పురాణ కథల ఆధారంగా సూర్యనారాయణుడని లక్ష్మీ సమేతంగా ఉన్నందున లక్ష్మీనారాయణ స్వామిగా ఇక్కడి భక్తులు కొలుస్తూ ఉంటారు. దేవాలయ శిల్పకళ నిర్మాణాన్ని బట్టి పరిశీలిస్తే మహారాష్ట్రలో అజంతా, ఎల్లోరా, నాసిక్, త్రయంబకేశ్వర్ క్షేత్రాలలోని శిల్పకళారీతులు ఈ ఆలయంలో కనిపిస్తాయి. జైనథ్‌లో ఈ ఆలయ నిర్మాణం గావడానికి, ఈ ఊరికి జైనథ్ అని పేరు రావడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి.

ఒక రాక్షస రాజు రాత్రికి రాత్రి దేవాలయాన్ని నిర్మించాలని శిల్పులను ఆదేశించారట. ఆరవ శతాబ్దంలో పల్లవ రాజు పెన్ గంగా పరివాహక ప్రాంతాల్లో వేట నిమిత్తమై సంచరిస్తూ, ఒక మర్రి చెట్టు నీడలో నిదురించాడు. అతనికి కలలో ఒక మహాపురుషుడు అగుపించి ఇక్కడ ఒక వైష్ణవాలయాన్ని నిర్మించుమని ఆదేశించాడు. ఆరాజు ఈ విధంగా ఆలయాన్ని నిర్మించినట్లు, కాలక్రమంలో ఈ విజయనాథపురం జయనాథపురంగా తరువాత జైనథ్ గా రూపాంతరం చెందినదని జనశృతి.

స్వామి విగ్రహానికి ముందు గల ద్వారమందు అందమైన శిల్ప తోరణాలు, సన్నని **(మిగతా 14 పేజీలో)**



# వనితా జన హితైషి

భగవంతుని సృష్టిలో సకల జీవరాశులు స్వరూప స్వభావాలతో సహజ సిద్ధంగా ప్రకృతికి అనుగుణంగా జీవనాన్ని సాగిస్తాయి. దేవ, తిర్యగ్, స్థావర, జంగమాది జీవరాశులలో తానూ ఒకడైన మానవుడు సహజత్వాన్ని కోల్పోతాడు. అలాగే తన జీవన ధర్మాన్ని తెలుసుకోవడం కూడా చాలా క్లిష్టతరం. త్రిగుణాత్మకమైన ప్రకృతికి లోబడి ఉండుటే గాక ఇంద్రియాలకు, కర్మకు లోబడి యథార్థ జ్ఞానం లోపించే జీవనాన్ని కొనసాగిస్తాడు. పుట్టుక పరమార్థము జీవన విధి స్పష్టంగా తెలుసుకోకుండానే జీవిత గమనాన్ని పూర్తి చేస్తాడు.



ప్రకృతిలో ప్రతి అణువు దాని యొక్క చర్య ప్రతి చర్యలకు ప్రభావితమవుతూ సహజ సిద్ధమైన పరిణామ క్రమంలో సాగుతుంది. ఒక్కోసారి మానవ ప్రమేయంతో వికృతంగా మారడం కూడా మనం గమనించవచ్చు.

మానవుడు శ్రేయోదాయకమైన జీవితాన్ని సాగించడానికి వేద విజ్ఞానమే తోడ్పడుతుంది. అందుకే వేదాలను కల్మషాల్ని హరించే అగ్నితోను, వెలుగుతో దారి చూపే సూర్యునితోను పోలుస్తారు. ఆ వేద వాక్యార్థాలను పాండిత్యంతో గ్రహించి చెప్పడం కాకుండా యోగ మహిమచే, ఉపాసనా బలంతో పరమ ఋషులు వేద తత్వాన్ని సాక్షాత్కరించుకున్నారు. ఆ మహర్షుల ద్వారా లోకోప కారకంగా వేదోపబృంహణాలు శాస్త్ర, ఇతిహాస, పురాణాదులు ఆవిర్భవించాయి. వాటన్నింటి ద్వారా మనకు మంచి మార్గాన్ని అలవరచడానికి, వేదవిహిత జ్ఞానాన్ని అందించడానికి ఎందరో ఆచార్యులు అవతరించారు. భగవత్ తత్వ జ్ఞానాన్ని తెలుసుకోవడంలో ఒక హేతుబద్ధమైన ఆలోచనా సరణిని, ఆచరణ విధానాన్ని విస్తరింప చేసిన వారు

- శ్రీమతి సముద్రాల శారద

భగవద్రామానుజాచార్యులు.

లౌకికంగా అయినా ఆధ్యాత్మికంగా అయినా స్వస్వరూప జ్ఞానం కలిగినప్పుడే ఎవరికైనా కర్తవ్యం స్ఫురిస్తుంది. కర్తవ్యం స్ఫురిస్తేనే లక్ష్యం స్పష్టమవుతుంది. లక్ష్యాన్ని చేరుకునే మార్గంలో తద్విరోధాలు (ఆటంకాలు) అధిగమించడం కర్తవ్య నిష్ఠతో సాధన చేయడం జరుగుతుంది.

అనంత కళ్యాణ గుణ సాగరమైన భగవత్ తత్వ జ్ఞానం కలగడానికి, ఆత్మ స్వరూపాన్ని తెలుసుకోవడానికి అనుసరించ వలసినది "శరణాగతి మార్గమే! అని భగవత్ సంబంధ జ్ఞానానుభవాన్ని కలిగించే ఆధ్యాత్మిక జ్ఞాన సంపదను లోకానికి అందించారు. అందుకే వేలాదిమంది నాస్తికులు యతిరాజులను ఆశ్రయించి ప్రపన్న మార్గాన్ని స్వీకరించారు. శరణాగతి భావానికి మూలము అనన్య భక్తి. భగవంతుని అవతార విభూతిని అనుభవించి అనన్య భక్తిని నిరూపించిన వారు ఆళ్వార్లు, ఆచార్యులు. వారి భావపరంపరను అర్థం చేసుకుని అనుభూతిని పొందగలిగినప్పుడే అనన్య చింతన కలుగుతుంది. అనన్య భక్తి కలవారే ప్రపన్నులు

"స్వ పురుష మభివీక్ష్య పాష హస్తం వదతి యమః తస్య కర్ణమూలే పరిహర మధుసూదన ప్రపన్నాన్ ప్రభు రహ మన్య నృణాం న వైష్ణవానామ్" పాషాన్ని ధరించిన యముడు తనకింకరులతో విష్ణు భక్తులకు ప్రభువును నేను కాదు కనుక మధుసూదన ప్రపన్నులను పరిహర! వదిలి వేయండి! అని ఆజ్ఞాపిస్తాడట!

భగవత్ స్వరూప స్వభావాలు తెలియనప్పుడు భగవత్ ప్రాప్తి ఎలా కలుగుతుంది?. గమ్యం తెలిస్తేనే కదా! లక్ష్యం వైపు గమనం సాగుతుంది! అందుకే మధుసూదన ప్రపన్నులు

# వనితా జన హితైషి

అంటే భగవంతుని భజించ కున్నను దేవతాంతరములు భజింపక పరాత్పరుడు పరమాత్ముడే అని తెలిసినవారు మధుసూదన ప్రపన్నులు అని ఆళ్వార్లు నిష్కర్షగా భగవత్ తత్వాన్ని బోధించారట!

అందుకే పరివార దేవతలను, భగవత్తత్వం ఎరిగిన భాగవతోత్తములను, మార్గదర్శనులైన ఆచార్యులను, భక్తి మాధుర్యాన్ని పంచిన ఆళ్వారాదులను, ఆరాధించి తరించాలని, భగవత్ ప్రాప్తికి పురుషకారంగా వారి యందు కైంకర్య నిష్ఠతో జీవించాలని పెద్దల మాట!

భగవత్ భక్తులైన ప్రపన్నులు స్త్రీలైనా, జన్మతః అన్య మతస్థులైనా భగవద్ రామానుజాచార్యులు వారిని ఉద్ధరించిన తీరు సాటి లేనిది.

**బీబినాచ్చియార్:**

భగవత్ రామానుజాచార్యులు పరిస్థితుల పరిణామం వలన శ్రీరంగం వదలి మేల్ నాడు లో సుదీర్ఘకాలం నివసించారు. సిద్ధాంతాన్ని ప్రాచుర్యం చేసి అనేక దేవాలయాలను ఉద్ధరించారు. అతి ప్రాచీన పవిత్ర స్థలమైన మేల్కోటలో చలువ నారాయణస్వామిని ప్రతిష్ఠించారు. వేలమంది నాస్తికులను మార్చి వేద మార్గ ప్రవర్తకులుగా పరివర్తింప జేశారు. సత్యాన్వేషకులైన సాధకుల చేత శ్రీ వైష్ణవాన్ని అనుసరించేలా చేశారు. తిరునారాయణ పుర ఉత్సవర్లు శెల్వ పిళ్ళై మూర్తిని తిరిగి చేర్చే క్రమంలో భగవద్ రామానుజాచార్యులు అన్యమత స్త్రీ అయిన బీబీ నాచ్చియార్ కీర్తిని ఇనుమడింప చేశారు.

శ్రీరంగం నుండి బయలుదేరి ఎందరో భక్తుల కైంకర్యాలు స్వీకరిస్తూ వడగనంబి మొదలగు శిష్యులను అనుగ్రహించి సాలగ్రామం నుండి బయలుదేరి తొండనూరుకు వచ్చారు. ఒక వైష్ణవ స్వామి కోరికపై అక్కడి రాజ దంపతుల ప్రార్థనను మన్నించి రాజ కుమార్తెను అనుగ్రహించారు. తీర్థ మహిమచే ఆమె చిత్త చాంచల్యాన్ని పోగొట్టారు. పరిసర ప్రాంతాలలోని అనేక దేవాలయాలను ఉద్ధరించారు. 'యదుగిరి'గా యుగయుగాల పవిత్రత గల ప్రాంతం, దత్తాత్రేయ స్వామి తపస్సు గావించిన ప్రసిద్ధ ప్రాంతం, మేలైన కోటలు గల ప్రాంతం తిరునారాయణపురం. అక్కడే నెలవైన అంతటి పవిత్ర చరిత గల తిరునారాయణమూర్తిని ప్రతిష్ఠించి రాజు సహాయంతో దేవాలయ నిర్మాణం గావించారు. అక్కడి ఉత్సవమూర్తికి పూర్వం శ్రీరామచంద్రులచే ఆరాధింపబడ్డారు కనుక రామప్రియర్ అని పేరు. బ్రహ్మదేవునిచే ఈయబడి సంపత్కుమార్లచే స్వీకరించి ఆరాధింపబడ్డారు కనుక సంపత్కుమారులుగా పేరు ప్రసిద్ధి. అయితే ముస్లిం రాజుల ఆక్రమణలలో ఎన్నో దేవాలయాలు కొల్లగొట్టబడ్డాయి. ఆ విధంగా ఉత్సవమూర్తి లేనందున రామానుజాచార్యులు చింతించారు. ఢిల్లి నవాబు వద్ద ఉన్నదనే వార్త తెలుసుకుని ఢిల్లీ వెళ్లి ఆ మూర్తిని తెచ్చుటకు సిద్ధపడ్డారు.

చోళరాజు దౌర్జన్యం కారణంగా మేల్కోట వచ్చిన యతి రాజులు మరింత క్రూరులైన ముస్లిం రాజుల వద్దకు వెళ్లాలన్న నిర్ణయం సాహసోపేతం ఆశ్చర్యకరం కూడా! ఇది వారి కర్తవ్య నిష్ఠకు ప్రతీక!

మేల్కోట రాజు సైన్య, సహకారాలతో శిష్యగణంతో యతిరాజులు ఢిల్లీ బయలుదేరారు. శ్రీ వైష్ణవ దివ్య చిహ్నాలన్నీ ధరించి తేజవంతంగా విరాజిల్లుతూ వచ్చిన సైన్యాన్ని బ్రాహ్మణోత్తములను, ఆచార్యులను చూసి నవాబు అతని పరివారము ఆశ్చర్యపోయారు. ముందుగా జగదాచార్యులు వర్తమానాన్ని, శుభకామనలను పంపి నవాబు మన్ననలను చూర గొన్నారు. వారి సాత్విక శోభను చూసి గౌరవించిన నవాబుతో "మా దైవమైన శ్రీహరి విగ్రహం మీ వద్ద ఉంది ఇప్పించండి" అని కోరారట! ఎన్నో ప్రాంతాల్లో నుంచి ఏనాడో ఔరంగజేబుచే కొల్లగొట్టి తెచ్చిన అనేక శైవ వైష్ణవ విగ్రహాలను నవాబు చూపించాడు కానీ అందులో వారు అన్వేషించే "రామ ప్రియర్" లేరు. ఆరోజు యతి రాజులు స్వామిని ప్రార్థించి ధ్యానంలో యథార్థాన్ని గ్రహించారు. నవాబు కుమార్తె చేత అంతఃపురంలో పూజింపబడుతున్న సంపత్కుమారమూర్తిని గురించి నవాబుకు తెలిపి అతని అనుమతితో అంతఃపురానికి వెళ్లారు.

కానీ ఆమె తన ఆరాధ్యమూర్తిని ఇచ్చుటకు నిరాకరించింది. బంగారంతో మణి మాణిక్యాలతో అంతకన్నా గొప్ప మూర్తిని ఇస్తానని బుజ్జగించినా ఆమె ఒప్పుకోలేదు. నవాబుకు ఏం చేయాలో తోచక మీ దేవుడు కనుక మీరు పిలిస్తే వచ్చినట్లయితే తీసుకొని వెళ్లవచ్చు అన్నారట! వెంటనే యతి రాజులు ప్రార్థించి పుత్రవాత్సల్యంతో భక్తితో పరవశులై తనయందు స్వామికి గల వాత్సల్యాన్ని పరీక్షిస్తూ "శెల్వ పెళ్ళై ఇటు రా! అని పర్యంకాన్ని ( ఒడిని ) చూపించారట!

వెంటనే ఆ మూర్తిలో చలనం కలిగిందని చరిత్ర. ఈ అపూర్వ దృశ్యాన్ని చూసిన (మిగతా 12 వ పేజీలో)



# దీపం జ్యోతి పరం బ్రహ్మ

## దీపావళి


శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి, స్థానాచార్యులు

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం


శ్రియఃపతి అయిన శ్రీమన్నారాయణుడు పరంజ్యోతి స్వరూపుడు అని "నారాయణ పరంజ్యోతి రాత్మానారాయణః పరః" అని ఉపనిషత్తు చెబుతున్నది. ఆ విధంగా భగవంతుణ్ణి జ్యోతి స్వరూపుడుగా పూజించడం. దీపం అనేది భగవంతుని స్వరూపంగా భావించడం మన సాంప్రదాయంలో ఉంది. మనకు నవంబర్ 12,13 తేదీల్లో నరక చతుర్దశి, దీపావళి పండుగలు వస్తున్నాయి.

పూర్వం కృష్ణావతార కాలంలో నరకాసురుడు అనే రాక్షసుడు మూడు లోకాలను అల్లకల్లోలం చేస్తున్న సమయంలో రాక్షసుని పీడ వదిలించడానికి సత్యభామా సమేతుడై శ్రీకృష్ణ పరమాత్మ ప్రాగ్జ్యోతిష పురము అని నరకాసురుడు పాలించే రాజ్యానికి వెళ్ళాడు. ఆ నరకాసురునితో యుద్ధం చేశాడు. నరకాసురుడు దేవతల లోకాలనుండి, గంధర్వలోకాలనుండి, మానవ లోకం నుండి ఎందరో స్త్రీలను చెరబట్టి తన రాజ్యంలో బంధించి ఉంచాడు. శ్రీకృష్ణ పరమాత్మ యుద్ధం చేసి నరకాసురుణ్ణి సంహరించి అందరికీ విముక్తిని కలిగించాడు. ఆ నరకాసురుని బారి నుండి స్త్రీలను అందరినీ రక్షిస్తూ తాను వివాహం చేసుకున్నాడు. అట్లా 16 వేల మంది స్త్రీలను ఆయన రాక్షసుని చెర నుండి విడిపించి వారందరికీ చక్కని జీవితాన్ని ప్రసాదించాడు. ఎప్పుడైతే నరకాసురుని పీడ విరగడయిందో ఆనాటి నుండి మనవాళ్లు ఆ గుర్తుగా 'దీపావళి' అనే పండుగ ఏర్పాటు చేసుకున్నట్లుగా తెలుస్తున్నది. శ్రీకృష్ణ పరమాత్ముడు నరకాసురుని సంహరించిన రోజున నరక చతుర్దశి, ఆ మర్నాడు అమావాస్య నాడు దీపావళిగా దీపాలు వెలిగించే సంప్రదాయం ఉంది.

దీపావళి పండుగ అనగానే అందరికీ ఉత్సాహం కలుగుతుంది. ఎందుకంటే అందరూ బాణాసంచాను కాల్చుకోవడం, అది పిల్లలకు మంచి వినోదాన్ని కలిగిస్తుంది. కానీ అసలు దీపావళి పండుగ అనేది ఏర్పడడానికి కారణం నరకాసురుణ్ణి శ్రీకృష్ణ పరమాత్మ సంహరించడం వలన అతని పీడ వదలడంతో అప్పటివరకు చీకట్లో మగ్గుతున్నట్లుగా ఉండే ప్రజలు సంతోషంతో దీపాలు వెలిగించుకొని పండుగను చక్కగా జరుపుకున్నారు. కనుక దీనికి దీపావళి అని పేరు వచ్చింది. అని మనకు పౌరాణికంగా తెలుస్తున్నది. సనాతనంగా దీపావళి పండుగ చీకటిని తొలగించి దీపాలు వెలిగించే పండుగగా ప్రసిద్ధమైనది.


**దీపాన్ని వెలిగించడం అంటే అగ్నిదేవతను పూజించటం పరంజ్యోతి స్వరూపమైన భగవంతుడూ దీపం రూపంలోనే ఉంటాడు. "దీపం జ్యోతి పరం బ్రహ్మ దీపం సర్వతమోపహం దీపేన సాధ్యతే సర్వం సంధ్యా దీప నమోస్తుతే"**

ఆశ్వీయుజ బహుళ చతుర్దశి నరక చతుర్దశిగా అమావాస్య దీపావళిగా దీపాలు వెలిగించడం ప్రారంభిస్తాం! అమావాస్య కాగానే కార్తీక పాడ్యమి ప్రారంభ మవుతుంది. అమావాస్య నుండి ప్రారంభించి కార్తీక మాసం అంతా కూడా దీపాలు వెలిగించే సంప్రదాయం మన దేశంలో ఉంది. "కార్తీక దీపాలు"అని అంటారు. కార్తీక మాసంలో దీపారాధన గొప్ప సాంప్రదాయం. ముఖ్యంగా అది ఎందుకు వచ్చింది? అంటే కృత్తికా నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసానికి కార్తీకమాసం అని పేరు. కృత్తికా నక్షత్రం అగ్నిదేవతాకమైన నక్షత్రము. అని వేదము చెబుతుంది "కృత్తికా నక్షత్ర మగ్ని ర్దేవతా అగ్నిర్వః పాతు కృత్తికాః నక్షత్రం దేవమింద్రియం ఇదమాసాం విచక్షణం" అని ఇలా వేదం కూడా కృత్తికా నక్షత్రాన్ని అగ్నిదేవతాకమైన నక్షత్రంగా చెబుతున్నది. కనుక అగ్నిదేవుని ఆరాధించే పద్ధతిలో అందరూ అగ్నిని హోమాల ద్వారా ఆరాధించలేరు కనుక సులభమైన పద్ధతిలో అగ్నిని ఆరాధించే విధానంలో ఈ దీపారాధన పద్ధతి ఉన్నది.

(మిగతా 15 వ పేజీలో)

# శ్రీపతి స్తుతి

## సుభాషితం
### మంచి మాట



ప్రాతర్నిత్యాను సంధానంలో
**'పంచాయుధ స్తోత్రము'**
-సుదర్శన ప్రార్థన -

**స్ఫురత్ సహస్రార శిఖాతితీవ్రం**
**సుదర్శనం భాస్కరకోటితుల్యమ్।**
**సురద్విషాం ప్రాణవినాశి విష్ణోః**
**చక్రం సదాహం శరణం ప్రపద్యే॥**

ప్రతిపదార్థం:స్ఫురత్=ప్రకాశించెడి, సహస్ర= వేయి సంఖ్య గల, అర = అరల నుండి వెలువడుచున్న, శిఖ= శిఖలతో (జ్వాలలతో), అతి తీవ్రం = మిక్కిలి తీవ్రంగా ప్రకాశించు చున్నట్టి, భాస్కర కోటి తుల్యం = కోటి సంఖ్య గల సూర్యుల ప్రకాశం వంటి ప్రకాశం కలిగిన, సురద్విషాం = దేవతలకు శతృవులైన అసురుల యొక్క, ప్రాణవినాశి = ప్రాణములను హరించు నట్టి, విష్ణోః = విష్ణువుయొక్క, సుదర్శనం చక్రం = సుదర్శన మనే పేరు గల చక్రాయుధమును, అహం= నేను, సదా = ఎల్లప్పుడు, శరణం = రక్షకముగా, ప్రపద్యే = పట్టుకొను చున్నాను.

తాత్పర్యము :- సుదర్శనం అంటే భక్తులకు మంచి దర్శనము గలది. సుదర్శనం చక్రం అంటే చక్రానికి మధ్యన అరలు (ఆకులు) అవి వేయి వుంటవి. అవి ఎప్పుడు మెరుస్తూ, మండుతూ జ్వాలలను ఎగజిమ్ముతూ వుంటవి. అంతే గాక కోటి సూర్యులు ఒకేసారి ప్రకాశిస్తే ఎంత వెలుగో అంతటి వెలుగు కలది. దేవతలను పీడించు రాక్షసుల ప్రాణములను హరించివేస్తుంది. విష్ణు మూర్తికి కుడి చేతితో ధరించ వీలుగా వుంటుంది. అట్టి చక్రమును నేను శరణు వేడుచున్నాను. నన్ను రక్షించే భారం ఆ చక్రముపై ఉంచి నిశ్చింతగా నున్నాను. ఈ సుదర్శన వైభవము అహిర్బుధ్న్య సంహితలో విశేషంగా చెప్పబడింది. పరమ శివుడు నారదునకు తెలుపుతాడు. దీనిపై కూర నారాయణ ముని శతకము వ్రాసి అరయరునకు వచ్చిన రోగమును తొలగింపజేసినాడు.

అందులో మామూలుగా ఒక బండి చక్రములో నుండు భాగములన్ని వున్నవి. బండి చక్రం పైన ఇనుముతో చేసిన కమ్మి వుంటుంది. కర్రతో చేసిన గుండ్రని భాగమును ఆ కమ్మిలో ఇముడునట్లు చేస్తారు అంటూ ఐదు అవయవములు

**శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు**

గలిగి సుదర్శన పురుషుడు ఉండటాన్ని వర్ణించుతారు.

కోటి సూర్య ప్రభ గలిగిన చక్రం. భగవంతుని సంకల్పం ననుసరించి వుంటుంది సూర్య ప్రభ గలిగిన చక్రం. మహా భారత యుద్ధంలో సూర్యుని తేజస్సు కప్పి వేసి చీకట్లు కమ్మునట్లు చేసింది. అది సాధ్యమా! అంటే కృష్ణుడు సుదర్శనుని ఆవిధంగా చేయమన్నాడు. కాబట్టి చీకట్లు ఆవరించునట్లు సూర్యాస్తమాన మైనట్లు చేశాడు సుదర్శనుడు. అంతే గాని నా తేజస్సును నేను లేకుండా చేసుకుంటానా? అని అనుకోలేదు గదా !

2. శంఖం అనే ఆయుధము యొక్క స్తోత్రము .

**విష్ణోర్ముఖోత్థానిల పూరితస్య**
**యస్య ధ్వని ర్దానవ దర్పహంతా।**
**తం పాంచజన్యం శశికోటి శుభ్రం**
**శంఖం సదాహం శరణం ప్రపద్యే॥**

ప్రతి పదార్థము: విష్ణోః = విష్ణు మూర్తి యొక్క, ముఖ= నోటి నుండి, ఉత్థ = వెలువడిన, అనిల = వాయువు చేత, పూరితస్య = నింపబడిన, యస్య = ఏ శంఖము యొక్క, ధ్వనిః = శబ్దము (చప్పుడు), దానవ = రాక్షసుల యొక్క, దర్ప = గర్వమును, హంతా = నశింప జేయునో, తం = అట్టి, శశి కోటి శుభ్రం = కోటి చంద్రుల కాంతి వలె తెల్లని కాంతి గలిగిన, శంఖం = శంఖమనే ఆయుధమును, అహం = నేను, సదా = ఎల్లప్పుడు, శరణం = రక్షకముగా, ప్రపద్యే = పట్టుకొనుచున్నాను.

తాత్పర్యము :- విష్ణువు రెండవ ఆయుధము శంఖము. ఇది స్వామికి ఎడమవైపున వున్న చేతిలో వుంటుంది. ఇది జ్ఞాన ప్రదము. ధృవుడు తపస్సు చేసిన తర్వాత విష్ణువు సాక్షాత్కరించినాడు. ఐతే స్తోత్రం **(మిగతా 22 వ పేజీలో)**






శ్రీమాన్ శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి

శ్రీమతే రామానుజాయనమః

గ్రామార్వణము

**శ్లో॥ ఏకభే సప్తమే గ్రామే వైరం హాని స్త్రి షష్ఠగే।**
**తుర్యాష్ట ద్వాదశే రోగః శేషస్థానే భవేత్సుఖం॥**
**(జ్యోతిస్సాగరము)**

గృహమును నిర్మించుకొను యజమాని (నిర్మాత) తన నామరాశినుండి గృహనిర్మాణము చేయు (లేక వాసము) గ్రామరాశి 1-7 రాశులలో ఒకటైన శత్రుభయము, 3-6 రాశులలో ఒకటైన హాని, 4-8-12 రాశులలో ఒకటైన రోగము, 2.5.9.10.11 రాశులలో ఒకటయిన సుఖమును గలుగ చేయును.

**బాదరాయణ మునీంద్రులు**

**శ్లో॥ పంచమో నవమో గ్రామో ద్వితీయో వా యదా భవేత్।**
**దశమైకాదశౌ శ్రేష్ఠౌ మనుష్యాణాం శుభావహౌ।**
**చతుర్థ స్వష్టమో గ్రామో ద్వాదశేవా యదా భవేత్।**
**నామరాశి స్థితో గ్రామ స్త్రిషట్సప్తాష్టమో భవేత్ ।**
**స్వకీయార్థ వినాశాయ సంతాపోస్తి పదే పదే॥**

యిందులో 4-8-12. రాశులయినపుడు ఆదాయము వచ్చి అది అచ్చుటనే వ్యయమగును. 1-3-6-7 రాశులయిన, స్వకీయమైన ధనము నశించును. తరచు సంతాపము కల్గును. అని బాదరాయణుల అభిప్రాయము.

యిచ్చట శుభములకు ఫల స్వీకరణలో వ్యత్యయమున్నను విషయమును నిర్ణయము చేయుటలో మాత్రము వ్యత్యాసము లేకపోవుట చేత అనుభవములో పైరెండు సూత్రములు సరిపోవుచుండుట చేత ఈ రెండింటిని సమన్వయ పఱుచుకోనుచు ఫలమును స్వీకరింపవలయును.

కొంతమంది వాస్తు పండితులు 'నామరాశి స్థితో గ్రామ' అనుటకు బదులుగా 'జన్మరాశి స్థితో గ్రామ' అని స్వీకరించి ఫలమును చెప్పుచున్నారు. యిది అనుభవ విరుద్ధమే సమ్మతము కూడ కాదు ఎట్లనగా!

**శ్లో॥ స్వనామ రాశితో గ్రామ రాశిర్ద్వంకేషు దిక్ శివైః**
**సమ్మిత శ్చేత్తదాతస్య తద్గ్రామే వాస ఉత్తమః**
**రోగోష్ట ద్వాదశేతుర్యై వైరమాద్యేచ సప్తమే।**
**హానిష్షష్ఠే తృతీయేచ గ్రామరాశౌ స్వనామభాత్**
(ముహూర్త గణపతి)


**శ్లో॥ యద్గ్రామభం ద్వంక సుతేశకాష్ఠా**
**మతం భవే ల్లాభ మత శ్శుభస్సః।**
**యద్భం శశాంకాగ్ని నగాబ్ధి తుల్యం**
**మద్వ్యోష్ట షట్కర్మ మిదం నిషిద్ధః।** (వాస్తు ప్రదీపం)

గృహమును నిర్మించుకొను యజమాని నామరాశినుండి గ్రామరాశి 2.5.9.10.11 రాశులలో ఒకటయిన ఉత్తమమని 1.3.4.7 రాశులలో ఒకటయిన సమమని 6.8.12 రాశులలో ఒకటయిన (నింద్యము) పనికిరాదు.

మేషరాశి వారికి - వృషభ, సింహ, ధనుస్సు, మకర, కుంభ రాశి గ్రామములు. వృషభరాశి వారికి - మిధున, కన్యా మకర, కుంభ, మీనరాశి గ్రామములు. మిధున రాశివారికి - కర్కాటక, తులా, కుంభ, మీన, మేషరాశి గ్రామములు. కర్కాటకరాశి వారికి - సింహ, వృశ్చిక, మీన, మేష, వృషభ రాశి గ్రామములు. సింహరాశివారికి - కన్యా, ధనుస్సు, మేష, వృషభ, మిధునరాశి గ్రామములు. కన్యారాశి వారికి - తులా, మకర, వృషభ, మిధున, కర్కాటక రాశి గ్రామములు. తులారాశి వారికి - వృశ్చిక, కుంభ, మిధున, కర్కాటక సింహరాశి గ్రామములు. వృశ్చికరాశి వారికి - ధనుస్సు, మీన, కర్కాటక, సింహ, కన్యా రాశి గ్రామములు. ధనుస్సు రాశి వారికి - మకర, మేష, సింహ, కన్యా, తులారాశి గ్రామములు. మకరరాశి వారికి - కుంభ, వృషభ, కన్యా తుల, వృశ్చిక రాశి గ్రామములు. కుంభరాశి వారికి - మీన, మిధున, తుల, వృశ్చిక, ధనుస్సు రాశి గ్రామములు. మీనరాశి వారికి- మేష, కర్కాటక, వృశ్చిక, ధనుస్సు, మకరరాశి గ్రామములు ఉత్తమములు. శుభప్రద, లాభప్రద, వృద్ధిప్రద, సుఖప్రద ములను కలుగ చేయును. మిగిలిన గ్రామ రాశులు నింద్యములు అనర్థ ఫలములను కలిగించును. ★

# శ్రీమన్నారాయణ ప్రపత్తి స్తోత్రము

## వాసుదేవ తేరుచ్చాయా



శ్రీమాన్ శ్రీ కండ్లకుంట వెంకట నరసింహాచార్యులు

వెనుకటి కాలములో ఒక పెద్దమనిషి ఒక ఊరిలోకి పోతూ ఆ ఊరి ముందర ఎదురైన వానితో ఈ ఊరు మంచిదేనా ? అని అడిగినాడట. దాని కతడు జవాబు చెపుతూ "నీ నోరు మంచిదైతే ఊరు మంచిదే అన్నాడట". అందుచేత మనము ఎదుటి వాళ్ళతో ప్రియంగా, హితంగా మాట్లాడాలి. అందువల్ల మనకు ఎన్నో లాభాలు కలుగుతవి. అదేవిధంగా దాసరీ నీకన్ను లొట్ట అని పిలిచి మరీ చెప్పకూడదు. వాడికి అది బాధను కలిగిస్తుంది. కనుక అందరిలోనూ లోపాలను కనుగొనడం దాన్ని ఎత్తి చెప్పడం కంటే ఒక్క మంచి గుణాన్నైనా గుర్తించి ప్రశంసించినట్లయితే అతడు అందరికి ప్రీతి పాత్రుడు కాగలుగుతాడు. సహనం ప్రధానం. సమ్యక్ దృష్టిముఖ్యము. తన కంట్లో దూలాన్ని పెట్టుకొని ఎదుటి వాడిలో నలుసులను వెతుక్కోవద్దు. ప్రియభాషి, హితభాషి మితభాషిన్నీ కావాలి. స్మితపూర్వాభిభాషి శ్రీరామచంద్రుడు. ఆయనలో ఎన్నో సుగుణాలు ఉన్నవి. "బహవో నృప కళ్యాణ గుణాః పుత్రస్య సన్తి తే" అన్నారు పౌర జానపదులు.



ప్రశంస మనిషిని సహృదయుడిని చేస్తుంది. రాతిని నాతిగా మారుస్తుంది. "యస్యాస్తి విత్తం స నరః కులీనః" అన్నట్లు పొగడినట్లయితే ఎంత లేనివాడైన ఏదో ఒకటి తనకు కల్గింది సమర్పించుకుంటాడు, కానుకలు అందిస్తాడు. ఇది మానవుల విషయంలోనైతే! సర్వేశ్వరుడు జగన్నాథుడు శ్రీమన్నారాయణుడిని గురించి ఐనట్లయితే చెప్పడానికి ఏమున్నది? ఆయన సమస్త కళ్యాణ గుణాత్మకుడు. ఆయన తనను స్తుతించేవారిని, తననే నమ్ముకున్న వారిని, మరొకరిని గురించి మాట మాత్రమైన పల్లెత్తి పలుకనివాడు అనన్యభక్తులకు తననే సమర్పించుకుంటాడు.

కుచేలుడికి చేసిన సేవలను బాగా గమనించాలి. తనతో సమానంగా భోగాలను అందించినాడు. కాళ్ళు కడిగి నెత్తిన పోసుకొన్నాడు. సాక్షాల్లక్ష్మీ స్వరూపమైన రుక్మిణీ దేవి వింజామరలతో వీచింది. ప్రయాణపు బడలికను పోగొట్టింది. సుదాముడి ఇంటికి పోయి పూలదండలను వేయించుకున్నాడు. వరాల జల్లును కురిపించినాడు. అందుకే కులశేఖరాళ్వార్లు "నాథే నః పురుషోత్తమే" అనే శ్లోకములో "స్వస్య పదస్య దాతరి సురే నారాయణే" అని చెప్పినాడు. స్వస్య పదస్య అనే పదానికి ఎంతైన వివరించగలరు మహానుభావులు. వేదము ఒకే ఒక్క మాటలో చెప్పింది. **"సోశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితేతి"** అని. ఇది తైత్తిరీయోపనిషత్తులోని బ్రహ్మవల్లి యందలి ముమ్మొదటిమాట. ఆనందాన్ని పట్టలేక భగవదుపాసన చేసిన వానికి, నీవాడిని అన్న వానికి, అనన్యమైన భక్తి గలవానికి కలుగబోయే మహాఫలాన్ని గమనించి నపుడు శ్రుతికి ఉబ్బుఆగలేదు. అంతటి మహానుభావుడిని, కళ్యాణ గుణాకరుడిని, ఉదారుడిని ఆశ్రయించు ఉపాసించు అని ఉద్బోధించింది. ఇంత కన్నా ఈ సంసార దరిద్రులకు కావలసింది ఏమున్నది ?

మనము మన ఇంటిలో, ఒంటిలో హిరణ్యనిధిని కలిగియున్న వాళ్ళము. ఐనా గుర్తించలేక పలు ఇడుములను కుడుస్తూ ఉన్నాము. ఒక్కసారి ఆ నిధిని ఆచార్య ముఖంగా గుర్తించినామా ఇంక మనకు కొరతలు ఉండవు. కండ్లారా కనుగొన్న నిధిని చూచినాక మనకు నోట మాట రాదు ధృవునికివలె. శిశువునకు తల్లి లభించితే కలిగే లోటు ఏమిటి? ఆ ఆనందము

(మిగతా 12 వ పేజీలో)

# వనితా జన హితైషి

(9 వ పేజీ తరువాయి) ఆనందించారు కానీ నవాబు కూతురు బీబీ మాత్రము ఎంతో దుఃఖించిందట! సౌందర్య మూర్తి పీతాంబరధారి అయిన సంపత్ కుమారులను సకల లాంఛనాలతో జగదాచార్యులు తిరునారాయణపురానికి తీసుకువెళ్ల సాగారు

కానీ స్వామిని విడిచి ఉండలేని అనన్య భక్తి సంపన్నురాలగు బీబీ నాచ్చియారును రామానుజాచార్యులు అలా చూడలేక పోయారు. నవాబు అనుమతితో పరమ పావని అయిన ఆమెను లక్ష్మీ అంశగా భావించి స్వామికి అర్పించి వివాహం చేయ సంకల్పించారు. పూర్వం ఆండాళ్ తల్లి నోము నోచి విగ్రహ రూపులైన రంగనాథ స్వామిని వివాహం చేసుకున్నట్టు బీబీ నాంచారిగా ఆమెకు శెల్వపిళ్లైతో వివాహం జరిపించారు. నవాబు లాంఛనంగా మణి మాణిక్యాలు, శుభ పరికరాలు ఎన్నో కానుకగా ఇచ్చాడట! అవి ఇప్పటికీ తిరునారాయణ పురంలో స్వామి సేవకు ఉపయోగిస్తారని ప్రసిద్ధి. స్వామి పాదాల చెంత బీబీ నాచ్చియార్ మూర్తిని కూడా ప్రతిష్ఠింప చేశారట! సంపత్ కుమార సమాగమంతో యతి రాజుల ఆనందం వెల్లి విరిసింది తిరునారాయణపుర వైభవం ఇనుమడించింది. అతి సామాన్యులకూ మంత్రానుష్ఠానమార్గం చూపిన కరుణామూర్తులైన భగవద్ రామానుజాచార్యులు శెల్వ పిళ్లై రావటానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కుల మత వర్గ భేదాలు లేకుండా అందరికీ మొట్టమొదట అప్పుడే దేవాలయ ప్రవేశం కల్పించారట!

తంజమాంబ: రామానుజాచార్యుల ధర్మపత్ని తంజమాంబ కొంత ఛాందస భావాలు కలదై వారి ధర్మనిరతికి ఆటంకం కలిగించేది. అయినా వారు సహనంతో తన నియమ నిష్ఠలు మానలేదు వారు సన్యాసం స్వీకరించిన తర్వాత తన ధనద్రవ్యాలలో సగభాగం ఆమెకు ఇచ్చి సగభాగం పెరుమాళ్ళకు సమర్పించారని చరిత్ర.

కాంతిమతీదేవి: తల్లియగు కాంతిమతి దేవికి పుత్రులై గొప్ప ఆనందాన్ని కలిగించారు ఆమె ఆజ్ఞానువర్తియై గురు శుశ్రూష, విద్యాభ్యాసాలను చేసి పరిపూర్ణమైన పుత్ర ధర్మాన్ని నిర్వర్తించారు.

ఆత్మోజ్జీవన మార్గంలో స్త్రీలకు కూడా కర్తవ్యాన్ని బోధించి వేద ధర్మాన్ని పరిరక్షిస్తూ భగవత్ భాగవత ఆచార్య నిష్ఠతో వనితామణులు జీవించే సుపథాన్ని ఆవిష్కరింపజేసిన గొప్ప సంస్కర్త వనితాజన హితైషి భగవద్ రామానుజాచార్యులు. ★


# శ్రీమన్నారాయణ ప్రపత్తి స్తోత్రము

## వాసుదేవ తరుచ్ఛాయా

**(11 వ పేజీ తరువాయి)** ఎంత గొప్పది? ఎంత ఎత్తుకు ఎదుగగల్గుతాము? కనుక ఆయనను ఆ శ్రీమంతుడిని, దయాసాగరుడిని, ఆపద్బాంధవుడిని సముద్రములో (ఉప్పు నీటిలో) పుట్టని కల్పవృక్షాన్ని కోరుకునేవారికి తననైనా ఇచ్చుకొనే సురతరువును ఆశ్రయించుదాము. ఆదివ్య మంగళ విగ్రహుడిని స్తుతించుదాము. ఛాందోగ్యం **'సోన్వేష్టవ్యః స విజిజ్ఞాసితవ్యః'** అని గొంతెత్తిచెపుతున్నది.

ఆ దేవ వృక్షాన్ని ఆశ్రయించుదాము. చల్లని ఆనీడలో శ్రమించుదాము. సంసార తాపాలను తీర్చుకుందాము.


**శ్లో॥ వాసుదేవ తరుచ్ఛాయా నాతిశీతా న ఘర్మదా।**
**నరకాంగారశమనీ సా కిమర్థం న సేవ్యతే॥** అని అంటున్నది శ్రీవిష్ణు పురాణము. వాసుదేవుడు అనే మర్రి చెట్టు యొక్క నీడ చాలా గొప్పది. అది శాఖోపశాఖలుగా విస్తరించినటువంటిది. **"సహస్ర శీర్షాపురుషః** కదా! **సభూమిం విశ్వతో వృత్వా అత్య తిష్ఠత్ దశాంగులం"** కనుక ఆ చెట్టు నీడ లోకి చేరుకున్నట్లయితే అది మరీ చల్లగా ఉండదు. ఉక్కబోసి చెమటపట్టనివ్వదు. ఊపిరాడకుండ చేయదు. నరకబాధలు అనే నిప్పుల కుంపట్లను చల్లబరుస్తుంది. కాబట్టి ఓ అజ్ఞానులైన తెల్విలేని ప్రజలారా! జననమరణాల బాటలో సాగే దుఃఖితులగు బాటసారులారా రండి! రారండి! పరుగులుపెడ్తూ విచ్చేయండి. వాసుదేవుని పాద పద్మాలపై వాలిపోదాము. బ్రహ్మానందాన్ని పొందుదాము. సరేనా! ★




ఈ సంవత్సరం శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయరు స్వామి వారి తిర్నక్షత్రోత్సవాలు నవంబర్ 12 నుండి విజయకీలాద్రిలో వైభవంగా నిర్వహించబడుతాయి.

# జ్యోతిర్విజ్ఞానమ్

## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక



శ్రీసన్నిధానం పాఠకులు మీ జ్యోతిష్య శాస్త్ర సందేహాలను ప్రశ్నగా మాకు పంపండి, పరిష్కారాలను పొందండి! ఈ విజ్ఞానామృతాన్ని మీరూ ఆస్వాదించండి!!

(గత సంచిక తరువాయి) ప్రాకార వాస్తు.

వాస్తు శాస్త్రములలో వుండే భాగాలలో గత సంచికలో స్థల వాస్తు, స్థాన వాస్తు, వర్ణ వాస్తు గురించి కొంత వివరించుకోవడం జరిగింది. దాని తరువాత ప్రాకార వాస్తు. ఇది చాలా ప్రధానమైనటువంటి భాగం వాస్తు శాస్త్రములో ప్రత్యేక స్థానంగా గుర్తింపబడ్డది. ప్రహరీ అంటే ముందుగా వచ్చేది గాని, వెనకనుంచి వచ్చేది గాని గృహానికి రక్షణ కవచం లాగ పనిచేసే దాని పేరు ప్రహరీ.

ఈ ప్రహరీ నిర్మాణంలో చాల విధానాలు చెప్పబడినాయి. వాస్తుశాస్త్రంలో ప్రహరీ అని, ప్రాకారము అని, గ్రామీణ భాషలో పరారీ అని కూడా వ్యవహరిస్తుంటారు. ఈ ప్రహరీ ఎందుకు నిర్మాణం చెయ్యాలి? అని ప్రశ్నించుకుంటే. ఒక గృహము వాస్తుశాస్త్ర ప్రకారంగా సలక్షణంగా నిర్మాణం చేసుకుంటాము. శాస్త్రానికి వుండే విలువలని కూడా గృహానికి అద్ది అందులో నివసిస్తుంటాము. ఎదురిల్లు గాని, పక్క ఇల్లు గాని, వెనక ఇల్లు గాని వాస్తు శాస్త్రానికి విరుద్ధంగా, వ్యతిరేకముగా వుండి, అనేక రకాలైన కష్ట నష్టాలు ఆయా గృహాలలో వుండే వారంతా అనుభవిస్తుండే సమయంలో ఆ గృహం యొక్క ఛాయా అంటే నీడ, ఆ గృహంలో వుండే చెడు ఈ మంచిగా కట్టుకున్న గృహంమీద పడకుండా రక్షణ కవచంలాగా పనిచేస్తుంది. దాని పేరు ప్రహరీ, ప్రాకారము, ఇంగ్లీష్‌లో కాంపౌండ్ వాల్ అంటాము.

ప్రాచీన కాలంలో ఈ ప్రహరి నిర్మాణం ఎన్ని రకములుగా చేయవచ్చు అని పెద్దలు సూచించారు. శిలా ప్రహరీ, సుధా ప్రహరీ (సున్నం తో నిర్మాణం చెయ్యడం), మృత్తికతో (మట్టి) నిర్మాణం చెయ్యడం. ఆయా కాలాన్ని, ప్రదేశాన్ని, అక్కడ వుండే వసతుల్ని అనుసరించి ప్రహరీ గోడ నిర్మాణం చెయ్యాలి అని మనకు శాస్త్రం చెపుతోంది. ఈ ప్రహరీ గోడలో గృహానికి ఎంతెంత స్థలాన్ని, ఎంతెంత దూరంగా ఏ దిశలో ఎంత దూరంగా ఉండాలి. అనేది ఆ స్థలము యొక్క గణితం ప్రకారంగా లెక్కిస్తూ మరియు తూర్పు ఖాళీ స్థలం ఎక్కువగా, దక్షిణ పశ్చిమాలు తక్కువగా, ఉత్తర ఖాళీ స్థలము ఎక్కువ ఉండాలి. అంటే ఎలా దాని హద్దు చెయ్యాలి అనేదాన్ని నిర్మాణం ద్వారా తెలుసుకోవచ్చు.

పశ్చిమ, దక్షిణ దిశలలో వుండే ఖాళీ స్థలం తగ్గించి, తూర్పు ఉత్తరాలలో వుండే ఖాళీ స్థలాన్ని పెంచి అక్కడినుంచి ఒక హద్దును ఏర్పాటు చేసేదాని పేరు ప్రహారి. ఒక ఎకరం స్థలంలో చిన్నగా గృహ నిర్మాణం చేసుకుంటే దీనికి వర్తించవచ్చు, అవకతవకలు జరగవచ్చు. కనుక దానికి శాస్త్రీయమైన ఒక అడ్డు గోడ ఏర్పాటు చెయ్యాలి. తద్వారా ఆ గృహానికి సంబంధించిన స్థలము, ఆయా దిశలలో ఉండవలసిన శాస్త్రీయ ప్రమాణాన్ని అనుసరించి ఆ గృహానికి వర్తిస్తుంది. ఆ వర్తింప చేసే వ్యవస్థనే ప్రహరీ గోడ అని చెప్పబడుతుంది. ఆ ప్రహరీ గోడ రాతితోని నిర్మాణం చెయ్యవచ్చు.

పూర్వకాలంలో పెద్ద పెద్ద భవనాలు గాని, కోటలు గాని నిర్మించేటప్పుడు రెండు రకాలుగా కాపాడుకోవటానికి ఇటు వాస్తు రక్షణ, అటు శత్రు రక్షణ కొరకు బలమైన గోడలు ఏర్పాటు చేసుకొనేవారు. ఆ భవనమును బట్టి ప్రాకారం యొక్క ప్రమాణాలు పెద్దలు ఏర్పాటు చేశారు. అయితే దీని నిర్మాణంలో వుండే వ్యవస్థలో తూర్పు ప్రహరీ, దక్షిణ ప్రహరీ, పశ్చిమ ప్రహరీ, ఉత్తర ప్రహరీ అనే నాలుగు దిశలలో ప్రహరీని నిర్మాణం చేసేటప్పుడు గణితం చేసి లెక్కఏర్పాటు చేసుకోవాలని శాస్త్రంలో చెప్పబడ్డది. ఉదాహరణ: స్థల వాస్తులో చెప్పినట్టు ఈశాన్యం పల్లంగా, తూర్పు పల్లంగా, ఉత్తరం పల్లంగా, పశ్చిమము, దక్షిణము, నైరుతి, ఆగ్నేయం ఎత్తుగా ఉండాలి అని సిద్ధాంతాన్ని ఏర్పాటు చేశారు.

**( వచ్చే సంచికలో మరికొంత తెలుసుకొందాం)**



# సందేహాలు - సమాధానాలు

**నిత్యజీవితంలో ఎదురయ్యే జ్యోతిష్య, ఆధ్యాత్మిక, శాస్త్ర సంబంధమైన ధార్మిక సందేహాల నివృత్తికై శ్రీసన్నిధానం వేదికగా ఆయా పండితుల ద్వారా సమాధానాలు తెలుసుకోవచ్చు. ఇది పాఠకుల కోసం సరికొత్త శీర్షిక!. ఈ నెల పాఠకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు.**

★ **ప్రశ్న:** సాధారణంగా గృహ తిరువారాధన చేసిన సమయంలో పెరుమాళ్ళ తీర్థంతో పాటు ఆచార్య తీర్థం కూడా సేవించడం ఆనవాయితి. అయితే గురుపరంపర చదువుకుని ముందుగా ఆచార్య తీర్థాన్ని సేవించాలని చెబుతుంటారు. ఈ రెండిట్లో ఏది కరెక్ట్ చాలా కాలంగా సాంప్రదాయ గృహాలలో పెరుమాళ్ళ ఆరాధన తరువాత పెరుమాళ్ళ తీర్థంతో పాటు ఆచార్య తీర్థం సేవించడం ఆనవాయితీగా వస్తుంది ఈ సందేహాన్ని నివృత్తి చేయండి?

★ జవాబు :**శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు**

సమాశ్రయణం అయిన వారు స్నానం అయిన తరువాత స్వరూపముగా గురు ఉపదేశ మంత్రం చదువుకొని శ్రీపాద తీర్థం పుచ్చుకొంటారు. మిగతా వాటితో సంబంధం లేదు. శ్రీపాద తీర్థం తీసుకోవడం వలన మనం పవిత్రులం అవుతాము. ఆ తరువాత భగవదారాధన చేసుకొని పెరుమాళ్ళ తీర్థం తీసుకోవాలి. అయితే కొంతమంది తమకు సంబంధించిన శిష్యులు ఉంటే, లేదా ఇంకా ఇతరులు ఎవరైనా సమాశ్రయణం అయినవారు ఉంటే వారికి శ్రీపాద తీర్థం ఇవ్వాలి, అలవాటు చెయ్యాలి అనే పద్ధతితోని మూడు సార్లు పెరుమాళ్ళ తీర్థంతో పాటు రెండు సార్లు శ్రీపాద తీర్థం ఇస్తారు. పద్ధతి ఏమిటి అంటే పెరుమాళ్ళ తీర్థంతో శ్రీపాద తీర్థం ఇవ్వడం అనేది లేదు. పెద్దలు ఇస్తున్నారు కదా అంటే ఈ కారణం వల్లనే ఇస్తున్నారు. ఎక్కడైనా ఒక కార్యక్రమమైంది అక్కడ శ్రీపాద తీర్థం కావాలి కనుక పెరుమాళ్ళ తీర్థంతో పాటు శ్రీపాద తీర్థం ఇవ్వడం జరుగుతుంది. పెరుమాళ్ళ తీర్థం పెట్టిన ప్రతిసారి శ్రీపాద తీర్థం పెట్టడం అనేది లేదు. వారి శిష్యులైనా, వేరేవారి శిష్యులైనా శ్రీపాద తీర్థం అలవాటు చెయ్యడం అనేది పద్ధతి.

## మన దేవాలయాలు

**(5 వ పేజీ తరువాయి)**

గొలుసులు చిరుగంటలు, ద్వారానికి ఇరువైపులా జయ విజయుల విగ్రహాలు, ద్వారము గడప యందు తిరునామములతో కూడిన శంఖ చక్ర ముద్రలు చెక్కబడి ఉన్నాయి. ఆలయ మంటపమందున గరుడాళ్వారులు, లక్ష్మీ సమేత హయగ్రీవ స్వామి, శంఖ చక్ర గదాధారి అయిన చెన్నకేశవ స్వామి, అభయ ముద్ర లో విశ్వక్సేనుడు ఉన్నారు. ఈశాన్యమునందు అనంతపద్మనాభ స్వామి విగ్రహాలు దర్శించవచ్చు. అపురూప శిల్ప సంపదతో అలరారుతున్న కళ్యాణమంటప శిలా స్తంభాలు, సంగీత, నృత్య భంగిమలతో యున్న యక్షకిన్నర శిల్పాలు చూపరులను ఆకర్షిస్తుంటాయి. ఆలయం చుట్టూ రాతి గోడలు గజాశ్వ రథ యుద్ధభేరీలు వరుసక్రమంలో కనిపిస్తాయి. క్షీరసాగర మథన దృశ్యాలతో పాటు శివలింగాన్ని అభిషేకిస్తున్న శిల్పాలు అద్భుతంగా చెక్కబడి యున్నాయి. భక్తుల తాకిడి వలన అక్కడక్కడ కొంత శిల్ప సంపద అరిగినట్లుగా కనిపిస్తుంది. 19వ శతాబ్దం నుండి ఈ ఆలయానికి 'దప్పూరి' వంశస్థులు ఆనువంశిక అర్చకులుగా కొనసాగు తున్నారు. ప్రస్తుతము దప్పూరి వెంకటరమణాచార్యులు మరియు దప్పూరి ధీరజ్ కుమార్‌గారలు అర్చకత్వాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఆలయ నిర్వహణకు గాను నిత్యోత్సవాలను నియమముగా కొనసాగించుటకు 68 ఎకరాల భూమి కూడా ఉన్నది. ఇంతటి ప్రాశస్త్యము గలిగినా పాలకుల చూపుకు నోచుకోక అభివృద్ధికి ఇంకా దూరంలోనే ఉన్నదని చెప్పవచ్చు. ప్రాచీన వారసత్వ సంపదను కాపాడుతూ గొప్ప పర్యాటక కేంద్రముగా అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

★

# దీపం జ్యోతి పరం బ్రహ్మ

# దీపావళి

**(8 వ పేజీ తరువాయి)**

ఏ దేవుణ్ణి ప్రార్థించినా ఏ దేవతను ఆరాధించినా ముందుగా దీపారాధన చేసి ఆ దైవాన్ని పూజించడం సంప్రదాయం. అలా దీపాన్ని వెలిగించడం అంటే అగ్నిదేవతను పూజించటం పరంజ్యోతి స్వరూపమైన భగవంతుడూ దీపం రూపంలోనే ఉంటాడు. "దీపం జ్యోతి పరం బ్రహ్మ దీపం సర్వతమోపహం దీపేన సాధ్యతే సర్వం సంధ్యా దీప నమోస్తుతే" అని సంధ్యాకాలంలో వెలిగించే దీపానికి పరంజ్యోతి స్వరూపంగా పేరు ఉంది.

కాంచీపురానికి దగ్గరలో తూప్పుల్ అని దివ్యదేశం ఆ దివ్య దేశంలో ఉండే స్వామి పేరు దీప ప్రకాశ స్వామి. ఆ స్వామిని స్తోత్రం చేస్తూ వేదాంతదేశికుల వారు ఈ విధంగా అంటారు.

**"దీపస్త్వమేవ జగతాం దయతా రుచి స్తే**
**దీర్ఘం తమః ప్రతినివర్త్యం ఇదం యువాభ్యామ్"**

అని స్తోత్రం చేస్తారు. ఓ దీప ప్రకాశ స్వామి! నీవు దీపమైతే అమ్మవారు కాంతి. కాంతి దీపం కలిసుంటే ఎలాగో అలా లక్ష్మీనారాయణులైన మీరిద్దరూ ఈ లోకాన్ని వెలిగిస్తున్నారు అని అంటారు. కనుక భగవంతుడు దీప స్థానంలో ఉంటే ఆ దీపం వెలుగు స్థానంలో అమ్మవారు ఉండి ఈ లోకాన్ని ఏలుతున్నారు కనుక దీపం లక్ష్మీనారాయణ స్వరూపం అని వేదాంతదేశికుల వారి మాట!

కార్తీక మాసంలో దీపం వెలిగిస్తే శివునికి కూడా ఇష్టం అనేది లోకంలో వ్యాప్తిలో ఉంది. ఈ దీపారాధనమును కార్తీక దామోదర పూజ అంటారు. దామోదరుడు అనగా పరమాత్మ శ్రీమన్నారాయణుడు. కార్తీక దామోదర ప్రీతి కొరకు దీపారాధన వెలిగించే పద్ధతిని కార్తీక పురాణం చెబుతోంది. భగవంతుడైన శ్రీమన్నారాయణుడు ఈ కార్తీకమాసంలో పూజించబడతాడు కనుక ఎక్కడ ఏ దేవాలయంలో దీపం వెలిగించినా కార్తీక దామోదర స్వామికే ప్రీతి కరమవుతుంది. తద్వారా మనకు అనేక శుభాలు కలుగుతాయి. కార్తీకమాసంలో దీపాలు వెలిగిస్తే గొప్ప ఫలితాన్ని ఇస్తుంది. అటువంటి మాసం కార్తీక మాసం. ఈ మాసంలో దీపాలు వెలిగిస్తే ఉత్తమమైన గతులు ఏర్పడతాయి. ఉత్తమ జన్మలు వస్తాయి.

అటువంటి గొప్ప మాసం ఇది. ముఖ్యంగా ఇండ్లల్లో దీపారాధనమే కాకుండా ఎక్కడైనా ఏ దేవాలయంలోనైనా దీపాలు వెలిగించి దామోదరుని పూజించడం సాంప్రదాయం. నరక చతుర్దశి పండుగ చేసిన తర్వాత అమావాస్య నాడు ఇంటి నిండా దీపాలు వెలిగించి ఆనాటి నుండి ప్రారంభించి, కార్తీక మాసం అంతా దీపాలు వెలిగించే సంప్రదాయం మన దేశంలో ఉంది. కార్తీకదీపం ఆరనీయక వెలుగిస్తూ ఉండాలని సాంప్రదాయం చెబుతుంది. దీపం అనేది జ్ఞానానికి ప్రతీకగా కూడా చెప్తారు. చీకటిని తొలగించి వెలుగులు నింపేది దీపం అలా మనలోపల ఉండే అజ్ఞానాంధకారం తొలగించి జ్ఞాన దీపం వెలిగించేది అని అంటారు. అటువంటి గొప్ప మాసం కార్తీక మాసం. దేవాలయాల్లో కార్తీక దీపోత్సవాలు చేసే సంప్రదాయం కూడా ఉంది. విష్ణువాలయాల్లో కృత్తికా దీపోత్సవం అని ప్రత్యేకంగా చేస్తారు. శివాలయాల్లో అయితే కార్తీకదీపం, ఆకాశదీపం చేస్తారు. దానితో పాటు అభిషేకాలు చేస్తారు. ఈ విధంగా శివునికి, విష్ణువుకు ప్రీతికరమైన మాసం కార్తీక మాసం. ఈ మాసం చేయవలసింది దీపారాధనా కైంకర్యము.

వృశ్చికా సంక్రమణంతో కలిసి ఉన్న కార్తీక మాసం విశేషమైనది. ఈసారి సౌర మాసం ప్రకారం వృశ్చికమాసం కార్తీక మాసం రెండు కలిసి ఉండే కార్తీక పూర్ణిమ ఈనెల 27వ తారీకున వస్తున్నది. ఆరోజున కార్తీక పూర్ణిమ, కృత్తికా నక్షత్రం, తిరుమంగైయాళ్వార్ అనే మహనీయుల తిరునక్షత్రం. వీరి తిర్నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆళ్వార్లకు చేసే వివిధ సేవలతో పాటు "ప్రబంధ నిగమనము" అని చేస్తారు. (తిరుక్కార్తి అని శ్రీ వైష్ణవ పరిభాష) తిరుక్కార్తితో ప్రారంభించి సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన తర్వాత హస్తా నక్షత్రం వరకు దివ్య ప్రబంధాధ్యయనాన్ని నిలుపుదల చేస్తారు.

"ప్రబంధ అధ్యయన నిగమన ఉత్సవము" కార్తీక మాసం ఈ సంవత్సరం పూర్ణిమ నాటి నుండే ప్రారంభం అవుతోంది. కనుక ఎన్నో విశేషాలు గల ఈ కార్తీకమాసంలో దీపారాధన చేసి విష్ణువాలయాల్లో విష్ణువును దామోదరునిగా, పరంజ్యోతి స్వరూపుడైన భగవంతునిగా ఆరాధించటం, అలాగే జ్యోతిర్లింగ స్వరూపునిగా శివుని ఆరాధించటం అనే విధానాలతో భగవంతుని ఆరాధించి శివకేశవుల అనుగ్రహానికి పాత్రులు అయ్యే అవకాశం ఉంది. ఈ కార్తీకమాసాన్ని సద్వినియోగం చేసుకొని పరమాత్మ అనుగ్రహానికి పాత్రులమవుదాం! ★

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు



శ్రీమతి తిరుమల నీరజ

(క్రిందటి సంచిక తరువాయి)

అప్పుడు హిరణ్యాక్షుడు అతిభయంకరంగా ఉన్నాడు. తన గదను చాచి క్రోధంతో మాధవుణ్ని కొట్టాడు. మాధవుడు ఆ దెబ్బను తప్పించుకొని శౌర్యంతో ఆ గదను తన చేతితో ముక్కలు చేశాడు. దైత్యుడు శ్రీహరిని వధించాలని మరొక గదను తీసుకొని భయంకరమైన దెబ్బ వేశాడు.

గదాయుద్ధ ప్రవీణుడైన ఆ గదాధరుడు - శ్రీహరి - దాన్ని పట్టుకొని, ఆ దైత్యుణ్ని రొమ్ము అదిరే విధంగా కొట్టాడు. ఆ దెబ్బకు వాడు వివశుడై అంతలోనే తెలివి తెచ్చుకొని, తన ప్రత్యర్థి ఐన మాధవుణ్ని తిరిగి కొట్టాడు.

ఈ విధంగా హరి, హిరణ్యాక్షుడు ఎవరికి వారే గెలవాలనే పట్టుదలతో ఉత్తరదక్షిణ సముద్రాలు రెండూ అలలతో కొట్టుకొంటున్నట్లు, మత్తగజాలు, తుండాలు చాపి దెబ్బలాడుకొంటున్నట్లు, రెచ్చిపోయి భయానకంగా తలపడే బెబ్బులుల వలె హద్దు మీరిన గర్వంతో రంకెలు వేస్తూ ఎదుర్కొనే మదించిన ఆబోతుల వలె, సహించే వీలు లేని పరాక్రమంతో సింహాల వలె యుద్ధం చేస్తున్నారు. ఈ ప్రకారం ఆ ఇద్దరూ దగ్గరగా వస్తూ, దూరంగా తొలగిపోతూ, పరస్పరం తిరస్కరించుకొంటూ, రక్తం వాసన చూస్తూ, ఒకరి నొకరు పరిహాస మాడుకొంటూ గదాయుద్ధం సాగిస్తున్నారు.



ఆ తరుణంలో ఆ బలశాలుర యుద్ధాన్ని తిలకించాలనే కోరికతో విరించి - చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడు - మునీంద్రులు, సిద్ధులు, సాధ్యులు, దేవగణా లందరితోనూ కలసి ఆ చోటికి వచ్చాడు. ధరామండలం కొరకు రాక్షసునితో పోరాడుతున్న ఆ యజ్ఞవరాహస్వామితో ఇట్లా అన్నాడు.

"ఓ పరమేశ్వరా! దివ్యస్వరూపా! ఈ పాపి అసురుడు నేనిచ్చిన వరాల గర్వంతో మదించి ఈ భువనాలన్నిటినీ బాధిస్తున్నాడు. ఇలాటి వాణ్ని సంహరించకుండా ఉపేక్షించటం మేలైన పని కాదు. వీణ్ని వెంటనే బలి ఇచ్చి ఈ భూమికి శుభం చేకూర్చు. ఈ పట్టపగలు ఈ అభిజిత్ ముహూర్తంలో ఈ రాక్షసుణ్ని చంపకపోతే, సంధ్యాకాలం వస్తుంది. అప్పుడు వీడి మాయలు పెరిగి, బలం అధిక మవుతుంది. సజ్జనులకు హితం చేయడంలో ప్రేమ కల నీవు వెంటనే వీణ్ని వధించు!"

అప్పుడు పుండరీకాక్షుడు నవ్వు ముఖంతో ఆ దనుజేంద్రునికి అభిముఖంగా నిలబడ్డాడు. తెల్ల తామరరేకుల వంటి నారాయణుని నేత్రాలు గొప్ప దైన కోపంతో ఎర్ర తామరలు కాగా, ఘనమైన తన గదను ఎత్తి ఆ రాక్షసుణ్ని పెళ్లున కొట్టాడు. వాడు ఆ దెబ్బను తప్పించుకొన్నాడు. మెల్లగా దితిపుత్రుడైన ఆ హిరణ్యాక్షుడు, అతిభయంకరమైన గదను పట్టుకొని, రకరకాల పద్ధతులలో విష్ణువు దగ్గరగా వెళ్లి, ఆయన చేతిలోని గదను సముద్రం మధ్యలో పడేలా దెబ్బ కొట్టాడు.

అట్లా శ్రీహరి నిరాయుధుడయ్యేసరికి, సురారి - దేవతల శత్రువు, దనుజుడు - యుద్ధధర్మాన్ని తలచి యుద్ధం ఆపేసి నిలబడి చూస్తూ ఉండిపోయాడు. ఆకాశ మంతా దేవతల హాహాకారాలతో నిండిపోయింది. హరి అతని ధర్మానికి మనసులో విస్మితుడైనా, తన ప్రయత్నం మానలేదు.

ధరాచక్రాన్ని రక్షించి హిరణ్యాక్ష దానవుణ్ని వధించటం కొరకు తన ఆయుధం సుదర్శనచక్రాన్ని స్మరించాడు.

ఆ చక్రం దైత్యవంశ మనే అరణ్యాన్ని దహించేది. ఎల్లప్పుడూ జయ జయ శబ్దాలతోనే మ్రోగుతుంది. తనను ఆశ్రయించిన వారికి అడ్డు లేకుండా చేస్తుంది. ధాత్రీవలయాన్ని పరిపాలిస్తుంది. ప్రచండమైన సూర్యమండల కాంతులతో ప్రకాశిస్తుంది. శత్రువుల బాహుబలగర్వం అనే చీకటిని అణచివేస్తుంది. అటువంటి ఆ సుదర్శనచక్రం జయ జయ శబ్దాలతో శోభిల్లుతూ, అంతు లేని తేజస్సుతో వెలుగులు ప్రసరింపచేస్తూ, అత్యంతవేగంతో వచ్చి అసురారి - అసురుల శత్రువు, నారాయణుని కుడిచేతిని అలంకరించింది. రథచక్రం వంటి ఆ సుదర్శనచక్రాన్ని ధరించి స్వామి హిరణ్యాక్షునికి ఎదురుగా వచ్చాడు.

ఆ విధంగా వస్తున్న చక్రధారిని చూసిన దనుజుడు

(మిగతా 17 వ పేజీలో)

## భాగవతంలో భగవంతుని | అవతార గాథలు

( 16 వ పేజీ తరువాయి ) పెదవులు తడుపుకొంటూ, తన పరాక్రమం వ్యర్థం కాకుండా, తన భయంకరమైన గదను పైకెత్తి, ఉత్సాహంతో ఆ యజ్ఞవరాహాన్ని కొట్టాడు. ఆ దెబ్బకు మాధవుడు ఆనందంగా చిరునవ్వు ముఖ పంకజంపై వ్యాపించగా, తన కాలితో రాక్షసుడు విసరిన ఆ గదను ఎక్కడికో పోయి పడే విధంగా ఒక్క తన్ను తన్నాడు. తన్ని ఆ అసురరాజుతో ఇట్లా అన్నాడు.

“గొప్ప గద నొకదాన్ని పట్టుకొని భుజగర్వంతో నన్ను ఎదుర్కొందామని వచ్చావుగా? రారా! దైత్యకులంలో పుట్టిన అధముడా!” అంటే, ఆ రక్కసుడు మరొక గదతో శ్రీహరిని మరొక దెబ్బ వేశాడు. స్వామి ఆ గదాదండాన్ని గరుత్మంతుడు ఒక త్రాచుపామును పట్టుకొన్నట్లుగా నేర్పుగా పట్టుకొన్నాడు. ఎదుర్కోవడానికి వీలు కాని శ్రీమహావిష్ణువు శౌర్యం ముందు తన బలం ఎందుకూ కొరగానిది అనే సంగతి తెలిసి కూడా ఆ అసురుడు గర్వంతో తలపడ్డాడు. తలపడి, కాల మనే అగ్నిజ్వాలల వలె భీతి కలిగించే భయంకరమైన శూలాన్ని ఆదివరాహ రూపధరుడైన శ్రీపతి మీద వేశాడు. కానీ అది బ్రాహ్మణునిపై చపలతతో ప్రయోగించిన హింసార్థకమైన హెూమకర్మ వలె నిస్సారమై పోయింది. మహేంద్రుడు ఘనమైన తన వజ్రాయుధంతో గరుడుని రెక్కలోని ఈకను ఎంతో వేగంగా తుంచినట్లుగా, తన చక్రాయుధంతో నారాయణుడు ఆ శూలాన్ని వేగంగా ఖండించాడు. దానికి దేవతలు ఆనందిస్తే, అసురులు దుఃఖించారు. అప్పుడా దైత్యుడు కోపంతో అతి కఠినమైన తన పిడికిలితో హరిని బలంగా పొడిచాడు. సుమమాల తాకిన గజరాజు వలె అతిదర్పంతో శ్రీమన్నారాయణుడు విరాజిల్లాడు.


వెంటనే పుండరీకాక్షునిపై రాక్షసుడు మాయాసమూహాన్ని పుట్టించాడు. ధరణీమండల మంతా దుమ్ము, చీకట్లతో నిండిపోయింది. భీకరమైన పెద్ద పెద్ద రాళ్లు, కుప్పలుగా మలమూత్రాలు, దుర్గంధంతో ఎముకలు, అంతు లేని రక్తప్రవాహాలు కురుస్తూ మేఘాలు గగన మంతా వ్యాపించి, మహాక్షోభను కలిగించాయి. అంతే కాకుండా భూతాలు, పిశాచాలు, దాకినులు జుట్టు ముడి వేసుకోకుండా, శరీరాలపై నూలుపోగు లేకుండా, భయం కలిగించే దంతాలు, దౌడలు, ఎర్రని కళ్లతో గుంపులు గుంపులుగా ఆకాశంలో నిలబడి ఆయుధాలు ధరించి గొడవ చేస్తూ, యక్ష దైత్య చతురంగ బలాలతో కనిపించాయి. (సశేషం)

## పుస్తక పరిచయం

# త్రయోదశోపనిషత్తులు

అమూల్యమైన సాంప్రదాయ గ్రంథమాలను అందించే మనస్విని ప్రచురణల ద్వారా ప్రచురించబడిన ఉద్ గ్రంథం త్రయోదశోపనిషత్తులు. సుందరమైన చిత్ర పుటలతో మూల అనువాద రూపకంగా గ్రంథం ముద్రితమైంది. ముందుమాటలుగా పీఠాధిపతులు ఆచార్యుల శ్రీ సూక్తులతో, ప్రముఖ పండితోత్తముల ఆధ్యాత్మిక జ్ఞాన ప్రకర్షగల వ్యాసములతో ముద్రించబడిన గ్రంథము త్రయోదశోప నిషత్తులు. వేద విద్య యందు పరిశోధనలకు ఉపకరించేలా, వేద మంత్రముల మూలమునకు క్రమంగా ఆయా విభాగాలకు అనువాద తాత్పర్యములతో సమగ్రంగా




వివరించబడింది. త్రయోదశోపనిషత్తులలో 1) ఈశావాస్యోపనిషత్, 2) కేనోపనిషత్ (కథ) 3) కఠోపనిషత్ 4) ప్రశ్నోపనిషత్ 5) ముండకోపనిషత్ 6) మాండూక్యోపనిషత్. 7) తైత్తరీయోపనిషత్ 8) ఐతరీయో పనిషత్ 9) చాందోగ్యోపనిషత్ 10). బృహదారణ్యోపనిషత్ 11) శ్వేతాశ్వతరోపనిషత్ 12). కౌశీతకీ ఉపనిషత్ 13) సుబాలోపనిషత్, వీని మూలము, వివరణలు ముద్రించ బడ్డాయి పూర్వపుట ముఖ చిత్రంగా వేదాత్మా విహగేశ్వరః అని వేద స్వరూపులైన గరుడాళ్వార్ విగ్రహ మూర్తిని, ఉత్తరపుటగా త్రయోదశ ఉపనిషత్తుల పేర్లు ఇయ్యబడ్డాయి. నాణ్యత గల కాగితంతో 750 పేజీలుగా కూర్చబడింది గ్రంథ రచనానువాదకర్త సుప్రసిద్ధ విద్వాంసులు డాక్టర్ కిడాంబి నరసింహాచార్య ప్రచురణకర్తలు విద్వాన్ డాక్టర్ కోయిల్ కందాడై వేంకట సుందరాచార్యులు. ఆసక్తిపరులకు ఆకర్షణీయంగా ప్రయోజనవంతంగా అమూల్య సమాచారంతో ముద్రితమైన త్రయోదశోపనిషత్తులు గ్రంథము అందుబాటులో ఉంది వెల 450. లభించు వివరములు ఫోన్ నెంబర్ 9490267511, 8331817994

# శ్రీభాష్య మంగళాచరణ శ్లోకము

# అఖిల భువన జన్మ...



**ఉభయ వేదాంత పండిత సభలలో (10-09-2023) "శ్రీభాష్య మంగళాచరణ శ్లోకము అఖిల భువన జన్మ" విషయాంశ ప్రవచనాన్ని ప్రసంగ వ్యాసంగా యథాతథంగా పాఠకుల కోసం.**

**శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు**

(క్రిందటి సంచిక తరువాయి) **అఖిల భువన జన్మ.....**

శీభాష్యాన్ని రాస్తూ భగవద్రామానుజుల వారు అద్భుతమైన ఈ శ్లోకాన్ని అందించారు. ఇది మొట్టమొదట వారు అందించిన శ్లోకం. "అఖిలభువనజన్మస్థేమభంగాదిలీలే" అనేటువంటిది ఒకే పదము. పరమాత్మకుండే నిత్య విభూతి, లీలా విభూతిలో అఖిల భువన అనగా లీలా విభూతిలో ఉండే భువనాలు. వాటికే జన్మ, స్థేమ, భంగాలు ఉంటాయి. పరమాత్మ అనంత కోటి బ్రహ్మాండాలను సృష్టించినవాడు, రక్షించేవాడు, లయం చేసేవాడు. ఇవన్నింటిని "లీలే" అనగా ఒక విలాసంగా అనాయాసంగా నిర్వహించే మహానుభావుడు శ్రీమన్నా రాయణుడు.

జన్మ అనగా సృష్టి, స్థేమ అనగా రక్షణ, భంగ అనగా లయము అని అర్థం. అంతటితో ఆగక "ఆది" అన్నారు. "ఆది" అనగా "అంతః ప్రవేశ నియమనం" అని అర్థం. **తత్ సృష్ట్వా తదేవానుప్రావిషత్** అని ఆదిలో మోక్ష పదాన్ని చేర్చవచ్చును కదా! అనగా వీల్లేదు! ఎందు వల్లననగా, శాస్త్రమునకు ప్రత్యేక లక్ష్యమే మోక్ష ప్రదత్వం. దానిని ప్రత్యేకంగా చెప్పవలసి ఉంది. మన పూర్వాచార్యులు అట్లాగే చెప్పారు. ఆళవందారులు **"త్వదాశ్రితానాం జగదుద్భవ స్థితిః ప్రణాశ సంసార విమోచనాదయః"** అంటూ సంసార విమోచనం అనే మోక్షాన్ని ప్రత్యేకంగా చెప్పారు. ***"జగజ్జన్మ స్థితి ధ్వంస మహానందైక హేతవే"*** అని మరొక దగ్గర చెప్పబడింది. అక్కడ కూడా ప్రత్యేకించి మహానందం అంటే "ముక్తిర్మోక్షో మహానందః" అని మహానందమనగా మోక్షం అని అర్థం. వేదార్థ సంగ్రహమందు ఈ విషయాన్నే ప్రత్యేకంగా భాష్యకారులు కూడా చెప్తుతూ వచ్చారు. అందుచేత ఆది అనే పదం చేత అంతః ప్రవేశ నియమనమనే అర్థం తీసుకోవాలి.

"లీలే" అనగా ఆనందాన్ని అనుభవించుటకు కారణంగా ఉండువాడు, స్వయంగా ఆనందించే వాడు.

**"వినత వివిధ భూత వ్రాత రక్షైక దీక్షే"** - వినతులు **"విశేషేణ నతాః వినతాః"** అనగా వివిధ, రకరకాలుగా భక్తి నిష్ఠులు, ప్రపత్తి నిష్ఠులు అని అర్థము. వ్రాత అనగా వారి సంబంధము కలిగిన వారందరినీ కూడా, రక్ష రక్షించువాడు. రక్షించటం అంటే అనిష్ట నివృత్తి పూర్వకం ఇష్ట ప్రాప్తి. అనిష్టమైన తాపత్రయాదులను తొలగింప చేసి ఇష్టమైన ఫలితాలను ఇచ్చే మహానుభావుడు. అటువంటి రక్ష యందు దీక్ష అనగా దృఢమైన సంకల్పం! ఆ రక్షయే ప్రధానంగా సంకల్పం కల మహానుభావుడు. ఆయన "శ్రుతి శిరసి విదీప్తే" శ్రుతి అనగా శ్రవణము ద్వారా వ్యాప్తి చెందినది వేదము. శిరసి అనగా శిరస్సు" "సర్వస్య గాత్రస్య శిరఃప్రధానం" అన్నట్లు వేదానికంతటికి శిరోభాగంగా ఉండేవి ఉపనిషత్తులు.

విదీప్తే- స్పష్టంగా ప్రతిపాదింపబడిన మహానుభావుడు. ఎవరాయన? పరస్మిన్ బ్రహ్మణి పరబ్రహ్మ. అంటే "బృహత్వాత్ బ్రహ్మణత్వాత్" అంతటి గొప్పనైన శరీరము గలవాడు, గొప్పనైన కళ్యాణ గుణములు గలవాడు. తనను ఆశ్రయించి తన దగ్గర చేరిన వారికి అంతటి గొప్పతనాన్ని ప్రసాదించు మహానుభావుడు.

శ్రీనివాసే- శ్రియఃపతి. "శ్రీనివాస" అనే పదం తిరుమలలో ఉండే శ్రీ వేంకటేశ్వర స్వామికి రూఢీ అయిన పదం. అనగా లక్ష్మీపతి అని తాత్పర్యం. మమ ఈ శ్లోకాన్ని చెప్పేవారు శ్రీ రామానుజులవారు."అహమస్మి అపరాధనాం ఆలయః" అని గద్య త్రయంలో చెప్పినట్లుగా అట్టి దోష యుక్తమైన నాకు అని అర్థం. శేముషీ భక్తి రూపమైన జ్ఞానము, ఉపాసనాత్మకమైన జ్ఞానము కలుగుగాక! అని ప్రతిపదార్థం.

ఇక విశేషార్థము. సాధారణంగా ఏదైనా గ్రంథం ప్రారంభం చేసేటప్పుడు నిర్విఘ్నంగా పరిసమాప్తి కావాలి అని మంగళాచరణం చేస్తూ ఉంటారు. **"మంగళాచరణ యుక్తానాం నిత్యంచ ప్రయతాత్మనాం జపతాం జగ్రతాం చాపి వినిపాతో న విద్యతే"** ఎవరైతే ఎల్లప్పుడు భగవత్ ధ్యానం చేస్తూ అనన్య మనస్కులై ఉండి జప హోమాది తత్పరులై ఉండి తాను ప్రారంభించే గ్రంథం విఘ్నం లేకుండా పూర్తి కావాలని భగవత్ ప్రసాదరూపకమగు మంగళాచరణాన్ని

ఎవరైతే చేస్తారో వారికి 'వినిపాతో న విద్యతే' నష్టం అనేది జరగదు అనే సూక్తిని అనుసరించి వీరు మంగళాచరణం చేశారు. ఈ మంగళాచరణమ్ మూడు రకాలుగా ఉంటుంది. **"ఆశీః, నమస్క్రియా, వస్తు నిర్దేశోవాపి తన్ముఖం"** అని ఆశీస్సు రూపంలో ఉండవచ్చు. విషయ ప్రతిపాదన రూపంలో ఉండవచ్చు. నమస్కార రూపంలో ఉండవచ్చు. ఇందులో భగవద్రామానుజుల వారు మూడింటిని ఏర్పాటు చేసి పెట్టారు. "మమ శేముషీ భవతు" నాకు జ్ఞానము సిద్ధించు గాక, అని శుభకామః ఆశీస్సు. **'శృతి శిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే'** అనడం వల్ల సృష్టి స్థితి లయ కారకుడగు బ్రహ్మ యొక్క ప్రతిపాదనము అందులో ఉంది. కాబట్టి అది వస్తు నిర్దేశ్యము. సాధారణంగా లోకంలో "ఇష్టంచ విహితాం లోకే సమాస వ్యాస ధారణం" అంటారు. అంటే చెప్పదగిన విషయాన్ని మొదట సమాసంగా చెప్పడం. ఆ తరువాత వ్యాసము, వివరించడం. సమాసమనగా సంగ్రహముగా చెప్పుట వ్యాసం అనగా విస్తరింప చేయుట. ఆ ఉద్దేశాన్ని అనుసరించి ఇందులో భగవత్ రామానుజుల వారు ప్రతిపాదించే భగవత్ తత్వాన్ని సంగ్రహంగా విడిచిపెట్టారు. 'వినత, భక్తిరూప' అనే పదాల వల్ల నమస్కార రూపమైనవి కూడా ఇందులో ఉన్నాయి. ఈ విధంగా వివిధములైన మంగళాచరణము చేశారు

అఖిల భువన భువనములనుగా రూఢీ అర్థం లోకాలు అని. కానీ "భవతీతి భువనం" అనే వ్యుత్పత్తి చేత సృష్టి కార్యవర్గం అంతా వస్తుంది. భువన అనే పదం రెండు అర్థాలతో కూడింది కనుక దీనిని యోగ రూఢం అంటారు. అఖిలం– "ఖిలం నాస్తి అఖిలం" భగవంతుని సృష్టిలో చేరనటువంటి ఏ వస్తువు లేదు అని అర్థం. సకల అనే బదులు సంపూర్ణం అనవచ్చును కదా అంటే,... నీకు అన్నీ తెలుసు అనే విషయంలో "అజ్ఞాతం నాస్తి తే కించిత్" అంటే సర్వజ్ఞుడవు అనేదానికన్నా నీకు తెలియనిది లేదు అనడం వల్ల సంపూర్ణంగా అన్నీ తెలుస్తాయి. అందుకే అఖిల అనే పదం వాడారు.

అఖిల అనే పదం బదులుగా "నిఖిల" అను పదం వాడవచ్చును కదా అంటే భగవద్వాచకమైనది అకారము గీతాచార్యులు "అక్షరాణాం అకారోస్మి" అన్నారు కాబట్టి అకారము భగవద్వాచకం. శ్రీభాష్యానికి శ్రుతప్రకాశకా వ్యాఖ్యానం రాసిన సుదర్శనభట్టర్ ఆచార్యులవారు మంగళాచరణ శ్లోకంలో(6వ) **"ప్రపద్యే ప్రణవాకారం భాష్యం రంగమివాపరం పరస్య బ్రహ్మణో యత్ర శేషిత్వం స్ఫుటమీక్ష్యతే"** అన్నారు. ప్రణవాకారంగా ఉన్న భాష్యానికి నమస్కారం చేస్తున్నాను అన్నారు. ప్రణవమనగా అకారం, ఉకారం, మకారం. "అ " అనేది ముందుండాలి కనుక అఖిల భువన అని ప్రారంభించారు. "ఉ" అనేది మధ్యలో ప్రథమాధ్యాయం నాల్గవ భాగంలో నాల్గవ పాదంలో **"ఉక్తం పరమపురుషార్థ లక్షణ మోక్ష సాధన తయా"** అని "ఉ" అనేది ప్రయోగించబడింది. ఆ తర్వాత "అనావృత్తి శబ్దాత్" అనే సూత్రంలో **"సూత్రాభ్యాసః శాస్త్రపరిసమాప్తిం ద్యోతయతీతి సర్వమ్ సమంజసమ్"** అని మకారంతో పూర్తి చేశారు కనుక **"ప్రపద్యే ప్రణవాకారం భాష్యం అపరం రంగమివ"** అని శ్రీరంగం లాగా అని ఒక దృష్టాంతం చెప్పారు. ఎందుకనగా **"పరత్వ బ్రహ్మణః రూపం శేషిత్వం"** అనగా పరబ్రహ్మ సర్వశేషి అనేది స్ఫుటంగా కనబడుతున్నది. అందుకే అకారం ప్రారంభంలో ప్రయోగం చేశారు.


ఇందులో ఇంకొక విశేషం ఏమిటంటే! మహాభాష్యం వ్యాకరణానికి సంబంధించింది. **"ద్వే భాష్యే శ్రీ మహత్ శబ్ద భూషితే శేష భాషితే"** అని మనకు ఒక సూక్తి ఉన్నది. సాక్షాత్తుగా ఆదిశేషునిచే చెప్పబడే భాష్యాలు రెండు ఉన్నాయి. ఒకటి పాణిని రాసిన వ్యాకరణ సూత్రాలు. అది మహత్ శబ్ద భూషితం. బ్రహ్మసూత్రాలకు వీరు రాసినది శ్రీ శబ్ద భూషితం. రెండు శేష భాషితం అనగా ఆదిశేషుడే పతంజలి రూపంలో మహాభాష్యం, భగవద్ రామానుజుల రూపంలో శ్రీ భాష్యం రాశారని ప్రసిద్ధి. మహాభాష్యానికి వ్యాఖ్యానాన్ని రాసిన భర్తృహరి "అ ఇ ఉ ణ్" అని అకారాన్ని ప్రారంభ ప్రయోగం చేశాడు **"అ ఇతి భగవతస్య నారాయణస్య ప్రథమా విధానం"** అన్నారు. అ అనేది పరమాత్మకు మొదటి పేరు. భగవద్వాచకమైన **"అకారం ప్రయుంజమానేన కిం నామ మంగళం నకృతం?"** అన్నారు.

అనగా భగవద్వాచకమైన అకారము చెప్పబడినందు చేత అన్ని మంగళములు చెప్పబడినాయి అని తెలిపారు. అందుచేత, "అఖిల భువన" అని ప్రారంభించారు. అయినప్పటికీ "ఖిలం నాస్తీతి" అని నిషేధవాక్యం మొట్టమొదట చెప్పడం అమంగళం కాదా! అని అనగా కాదు! ఎందుకనగా నిషేధింపబడే విషయాన్నిబట్టి అది మంగళమా! అమంగళమా! అని నిర్ణయిస్తారు. కానీ కేవలం పదాన్ని బట్టి కాదు!

జన్మ అనగా పుట్టుక. అది మూడు రకములు నిత్యం, నైమిత్తికం, ప్రాకృతికం అని. స్థేమ అనగా రక్షణ అది అనంతంగా ఉంటుంది. అంతర్యామి (మిగతా 22 వ పేజిలో)

# దివ్యమంగళరూపం

## అవయవ విభూతి



శ్రీమతి కొడకళ్ళ పద్మజ జ్యోతిర్మయి, చెన్నై.

భగవద్రామానుజుల వారి శిరోభాగంలో వేంచేసి ఉన్న నమ్మాళ్వార్లను సేవిస్తే, వారి కృష్ణ తృష్ణ మనకీ అనుభవం అవుతుందనీ, తిరుముఖమండలం సేవిస్తే అక్కడ శ్రీమన్నాథమునులు వేంచేసి ఉంటారు కాబట్టి, సంకీర్తన, భక్తిభావనలు కలుగుతాయనీ, నేత్రయుగ్మాలలో వేంచేసి ఉన్న శ్రీపుండరీకాక్షులను సేవిస్తే, సంస్కృత వేదానికి సమానమైన ద్రావిడ వేదవిద్య లభిస్తుందనీ, కపోల భాగంలో వేంచేసి ఉన్న శ్రీరామమిశ్రులు అనే మణక్కాళ్ నంబి గారిని సేవిస్తే వారి లాంటి ఆచార్యనిష్ఠ మనకూ ప్రాప్తిస్తుందనీ గతశీర్షికలో తెలుసుకోవడం జరిగింది. తర్వాత శ్లోకంలో ఉన్న ఆచార్యులను సేవిద్దాం.

**“వక్షఃస్థలం యామునాఖ్యం కంఠం శ్రీపూర్ణదేశికమ్!**
**బాహుద్వయం గోష్ఠీపూర్ణం శైలపూర్ణం స్తనద్వయమ్!!”**

**“పితామహం నాథమునిం విలోక్య ప్రసీద మద్వృత్త మచింతయిత్వా”** అంటారు యామునమునులు స్తోత్రరత్నం లో. స్వామీ! మా తాతగారు అయిన నాథమునులను చూసి, నా యొక్క సత్, దుర్వృత్తులను ఆలోచింపక అనుగ్రహించ వయ్యా! అని. శ్రీమన్నాథమునుల మనుమలు అన్నమాట. హిమవత్ పర్వతం మొదలుకొని పెరుమాళ్ళు అంటే శ్రీరామచంద్రమూర్తి నిర్మించిన సేతు వరకూ, అలాగే సూర్యచంద్రులనే శిరోభూషణంగా కలిగిన తూర్పు, పడమర కనుమల వరకు పూర్వ, ఉత్తర మీమాంస శాస్త్రంలో వీరికి సాటి మరొకరు లేరు, అనబడే గొప్ప ఏకసంథాగ్రాహి. భగవద్రామానుజులకు పరమాచార్యులు.



మనం పెరుమాళ్లను ఏ దివ్యదేశంలో అయినా తెల్లవారుఝామున విశ్వరూప సందర్శన సేవకు వెళ్లినప్పుడు చూడండి! బంగారుమయమైన పెద్ద కవాటాలను తెరవడం చూస్తాం. లోపల ఉభయదేవేరులతో సేవ సాయిస్తారు పెరుమాళ్ళు. అలా అంతటి ఎత్తుగా, విశాలంగా, బంగారు వర్ణంతో పెద్ద కవాటాలను పోలి ఉన్నదిట భగవద్రామానుజుల వారి వక్షఃస్థలం.

**“హృదయాంతర్నిహిత బ్రహ్మపుర గోపనార్థ మిట్ట హాటకమయ కవాటపుటమ్ పోల్”** హృదయాంతరాలలో పెట్టుకున్నారన్న మాట తమ పరమాచార్యులైన శ్రీయామునమునులను. ఎంతగా ప్రేమించారంటే మొదటి సారి శ్రీఆళవందార్లను సేవించడానికి శ్రీరంగం వెళ్ళినప్పుడు వీరు వెళ్లేసరికి వారు అప్పటికే తిరునాడును అలంకరిస్తారు. జీవించి ఉండగా తాను సేవించే అవకాశాన్ని శ్రీరంగనాథుడు అనుగ్రహించలేదని మనోక్లేశంతో రంగనాథుని సేవించకుండానే కాంచీపురానికి తిరిగి వెళ్ళిపోతారు భగవద్రామానుజులు. శ్రీరామానుజవైభవం అద్భుతంగా తెలుపుతుంది ఈ సన్నివేశాన్ని. మహిమ నిండుగా గల శ్రీరంగనగరంలో శయనించి ఉండే శ్రీరంగనాథా!! ఇప్పుడు నాకు చేసిన ఉపకారం చాలదా? అంటూ రంగనాథుని పట్ల కోపాన్ని పొంది శ్రీఆళవందార్‌కు చేయవలసిన అంతిమ సంస్కారాలు ముగిసిన తర్వాత, తమ ఋజుత్వాన్ని ప్రకటించి రామానుజులు తిరిగి కాంచీపురం వేంచేస్తారు. అంత హృదయాంతరంగాలలో వేంచేపు చేసుకు న్నారన్నమాట యామునమునులను. ఏ యామునమునుల దృష్టి ఆనాడు యాదవ ప్రకాశుల గోష్ఠిలో ఉన్న రామానుజుల వారి మీద పడిందో, ఆదృష్టి భగవద్రామానుజుల వారిని జగదాచార్యులుగా తీర్చిదిద్దింది. అందువలన రామానుజుల వారి వక్షఃస్థలమును సేవిస్తే “ఆచార్యకటాక్షం” లభిస్తుంది. రామానుజులవారే **“యత్పదాంభోరుహ ధ్యాన విధ్వస్తా శేష కల్మషః వస్తుతా ముపయాతోహం యామునేయం నమామితమ్”** అంటూ యామునమునుల తనియన్ని అనుగ్రహిస్తారు. **కంఠం శ్రీపూర్ణదేశికమ్:** శ్రీయామునమునుల శిష్యులైన శ్రీమహాపూర్ణులు అనబడే పెరియనంబిగారు వేంచేసి ఉంటారుట రామానుజుల వారి గంట కంఠస్థానంలో. ⇨

**"న వేదాంతాత్ శాస్త్రం న మధుమధనాత్ తత్త్వమఖిలమ్**
**న సత్త్వాత్ ఆరోగ్యం న ద్వయవచనతః క్షేమకరణం."**
అన్నట్టు భగవద్రామానుజుల వారికి పంచసంస్కారాలు కటాక్షించి, ద్వయమంత్ర అర్థాన్ని అనుగ్రహించిన ఆచార్యులు. **"కమలాపతి కళ్యాణ గుణామృత నిషేవయా"** అని పెరుమాళ్ళ కళ్యాణ గుణాలను అనుభవించీ అనుభవించీ పెరియనంబిగారయ్యారుట. ద్వయమంత్రంలో పూర్వ వాక్యం లక్ష్మీదేవితో కూడి ఉన్న నారాయణుడిని శరణాగతి చేయమని చెబుతుంది. ఉత్తరవాక్యం ఆ లక్ష్మీనారాయణ మిథునానికే చేసుకోవలసిన కైంకర్యాలను చెబుతుంది. ఈ అర్థాలన్నీ పెరియనంబి గారి దగ్గర వినగా వినగా భగవత్ రామానుజుల వారు చేర్తిఉత్సవంలో అంటే శ్రీరంగనాథుడు రంగనాయకి ఒకే ఆసనం మీద వేంచేసి ఉండగా పెరియపిరాట్టిని పురుషకారభూతురాలుగా చేసుకొని నంబెరుమాళ్ శ్రీపాదాలను శరణాగతి చేసి, గద్యత్రయాన్ని ఈ లోకానికి అందించారు. అలా శ్రీమహాపూర్ణులు వేంచేసి ఉంటారు కంఠ స్థానంలో.

ఎలా ఉన్నదట ఆ కంఠం అంటే ప్రణవ అక్షరాలు గొంతు లోపలే అదిమి పెట్టి ఉండగా, ఒక్కసారి ఉబికి బయటకు వెలువడినట్లు గల మూడు రేఖలు గలదైన గొప్పదైన తెల్లని పాంచజన్యమును పోలినదై వెలుగుచున్నదిట కంఠం యొక్క సొబగు. అలా భగవద్రామానుజుల వారి కంఠాన్ని సేవిస్తే ద్వయమంత్రార్థం ప్రాప్తిస్తుందిట.

**బాహుద్వయం గోష్ఠీపూర్ణం :** ఒక ప్రభువు తన కుమారుని కోసం పలువురు మంత్రుల వద్ద నిధులను నిక్షిప్తం చేసి, తన కుమారుడు పెద్దవాడు అయిన తర్వాత వాటిని అందించమని చెప్పి వెళ్లిపోయినట్టుగా ఆళ్వందార్లు తమ శిష్యులు పలువరి వద్ద ఒక్కొక్క అర్థ విశేషాన్ని ఉపదేశించి భవిష్యదాచార్యులకు, అంటే మన భగవద్రామానుజులకు అందజేయమని పరమపదాన్ని అలంకరిస్తారు. **"నమో నారాయణాయేతి మంత్రః సర్వార్థసాధకః"** అన్నట్టు గొప్పదైన తిరుమంత్ర ఉపదేశాన్ని, చరమశ్లోక ఉపదేశాన్ని ప్రసాదించిన ఆచార్యులు, శ్రీగోష్ఠీపూర్ణులు. తిరుక్కోట్టియూర్లో వేంచేసి ఉండేవారు ఈ మహానుభావులు. ఆ ఊరిలో ప్రజలకే అంత గొప్పవారు ఆ ఊరిలో ఉన్నట్టు తెలిసేది కాదట. ఆ రోజులలో 17 మార్లు రామానుజులు వారిని తిరిగి శ్రీరంగానికి పంపించేసిన అనువృత్తి ప్రసన్నాచార్యులు. మహాపూర్ణులూ, గోష్ఠీపూర్ణులూ, ఒక గురువుగారి వద్ద చదువుకున్నా మహాపూర్ణులు శ్రద్ధాసక్తులు లేని వారిని పంపరని ఒక ఊహ ఉన్నా, ఒకవేళ రామానుజుల వారు మహాపూర్ణుల మాట కాదనలేక బలవంతంగా వచ్చారేమో అని అన్న విషయాన్ని పరీక్షించడం కోసం 17 పర్యాయములు తిరిగి వెనక్కు పంపారు రామానుజుల వారిని. ప్రతిసారి కూడా అయ్యో! ఇంకా నాకు ఆ భాగ్యం పట్టలేదే అని విచారం కలిగినా "చెప్పను" అనడం లేదు కదా. మళ్లీ రా చెప్తాను అనే కదా అన్నారు అదే నా భాగ్యం అనే అభిప్రాయంలో ఉండేవారుట రామానుజుల వారు.

శిష్య లక్షణం మాత్రమే కాదది ప్రతివారికి ఉండాల్సినది. దాని పేరే ఆశావాదం. నిరాశ పడితే నిస్పృహ కలిగితే, ఆలోచనలు తన చుట్టూ ఉన్న సమాజానికి మంచి చేయవు సమతుల్యతని దెబ్బతీస్తాయి. తనకు ఎలాంటి గతి పట్టినా పరవాలేదు అని భావించి, తిరుమంత్ర అర్థాన్ని లోకానికి వెదజల్లిన వారి విప్లవాత్మకమైన భావాలు గోష్ఠిపూర్ణులను "ఎంబెరుమానారే" (నావంటి వారందరికీ మీరే నాథులు) అనే బిరుదాన్ని రామానుజుల వారికి ఇచ్చి ఆనందభాష్పాలు రాల్చేట్టు చేశాయి గోష్ఠిపూర్ణులని. ఈ మహానుభావులు వేంచేసి ఉంటారు రామానుజుల వారి బాహువుల్లో.

సాక్షాత్తు ఆదిశేషుని భోగానికి రూపం కడితే ఎలా ఉంటుందో అలా ఉన్నాయిట బాహుదండములు. అఘటితఘటనా సామర్థ్యము కలవాడైన ఎమ్బెరుమాన్ అంటే పెరమాళ్ళు చతుర్భుజుడైనా, ఈ ఉభయ విభూతుల యొక్క భారము భరించలేక, ఆ భారాన్నంతటినీ ఎమ్బెరుమానార్ల భుజాల మీద పెడితే వాటి భారాన్ని ఎత్తిన సామర్థ్యంతో రెండు బంగారు పర్వతముల వలే ఉన్నాయిట. **"బాహుచ్ఛాయా మవష్టభ్ధః యస్యలోకో మహాత్మనః".** ఏ మహాత్ముని బాహువులనే కల్పవృక్ష శాఖల నీడను ఆశ్రయించిన లోకం భయాన్ని పొందదం లేదో అనే రీతిలో అందరికీ విశ్రాంతిని ఇచ్చేట్టుగా ఉన్నాయిట. మోక్షం అనే ఫలాన్ని ఇవ్వడంలో సామర్థ్యం కలిగినవై వెలుగుతున్నాయట. **"తోళార్ శుడర్ త్తికిరి శంగుడైయ శున్దరన్"** బాహు మూలలలో ప్రకాశించే సుదర్శన, పాంచజన్య చిహ్నములు కలిగిన సుందరుడుట. తులసిపూస, తామరపుష్ప మాలలచే అలంకరింపబడి ఉన్నాయిట ఆ బాహువులు. **"ఇణై త్తోళ్ కళ్ వాషి"** రెండు బాహువులకు మంగళం. ద్వయమంత్రం అన్నకంఠం ఒకటైతే అష్టాక్షరీ, చరమం అన్న బాహువులు రెండన్నమాట. ఈ బాహువులు మనం సేవిస్తే అష్టాక్షరీ, చరమ శ్లోకార్థాలు ప్రాప్తిస్తాయట మనకు.

(మిగతా వచ్చే సంచికలో...)

# శ్రీపతి స్తుతి సుభాషితం

(9 వ పేజీ తరువాయి) చెయ్యాలనుకుంటాడు ధృవుడు. కాని చిన్న పిల్ల వాడు గదా జ్ఞానము, శక్తి చాలదు. ఐదేళ్ళ వయస్సు. అప్పుడు విష్ణుమూర్తి తన శంఖమును ఆ బాలుని చెంపకు అంటించాడు. అంటే తాకించాడు. వెంటనే ధృవుడు స్తోత్రం చేశాడని మహా భాగవతంలో వుంది. సుదర్శనాయుధము మహా వేడితో శత్రు సంహారం చేస్తుంది. కాని శంఖం కోటి చంద్రుల కాంతి వంటి కాంతి గలిగి చల్ల దనాన్ని, ఆహ్లాదాన్ని ఇయ్యగలది. అట్టి శంఖం ఆయుధమెట్లు? అని సందేహము. అందుకే విష్ణువు నోటి నుంచి వెలవడిన గాలిచే నింపబడుతున్నది గదా! ఆ గాలి శంఖం నుండి వచ్చి రాక్షసుల గర్వాన్ని అణచి వేస్తున్నది. ఆ శక్తి విష్ణువు నోటి గాలిలో వుందన్నమాట, మనకు మహా భారత యుద్ధంలో కృష్ణుడు శంఖాన్ని పూరించాడు. దాని నుండి భయంకరమైన ధ్వని వెలువడింది. **'సఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్'** అని భగవద్గీత ప్రథమాధ్యాయంలో వుంది. అంటే ఏమిటి అర్థం? ఆ శంఖధ్వని ధృతరాష్ట్రుని సైన్యంలోని వారందరి హృదయాలను చీల్చివేసింది అని. ఐతే ధ్వని అంతటా వ్యాపిస్తుంది గదా! పాండవ సైన్యం వారికి ఏమీ కాలేదా? అనే సందేహం వస్తుంది. వాళ్ళకు ఆనంద దాయకంగా వుంది. ఉత్సాహాన్ని కలిగించింది. అదే శంఖం యొక్క గొప్పదనము. చక్రం గూడా అంతే! శత్రువులకు భయంకరము, అనుకూలురకు రక్షకము. ఆయుధములన్ని వాటి సహజ గుణములను బట్టి ప్రవర్తించవు. ఏమంటే ప్రయోక్త ఐన పరమాత్మ సంకల్పానికి లోబడి పని చేస్తాయి. ఏపని చెయ్యాలి ? ఎవరిమీద ? అది గూడా ఎంతవరకు ? అనేది పరమాత్మాధీనము. సముద్రంలో దాగియున్న 'పంచజనుడు' అనే రాక్షసుని నుండి స్వామి వానిని సంహరించి స్వాధీనం చేసుకున్నాడని పురాణ వచనము. పరమాత్మకు ఈ ఐదు ఆయుధములే గాదు. అనంతమైన ఆయుధాలున్నవి. అవసరమనుకున్నప్పుడు మాత్రమే వాటిని ఉపయోగిస్తాడు.

శంఖంలోవున్న ప్రత్యేకత ఏమంటే పరమాత్మను విడిచి వెళ్ళదు. మిగతా ఆయుధాలు వెళ్ళి వస్తుంటవి. పైగా స్వామి నోటి వాయువే దానికి ధారకము, ఇంక ఈ శంఖ, చక్రముల గొప్పదనము వర్ణింపనలవి గానిది.

వీటి గుర్తులు మన మీద అంటే భుజాల మీద వుంటే యమ భటులు దరికి రారు. వైష్ణవులకు ఇవి అసాధారణ చిహ్నములు. యమభటులు **'దృష్ట్వా చక్రాంకితం దూర మపసర్పంతి'** చక్రాంకితమైన వాటిని దీనినైనా సరే, చూచి దూరంగా తొలగిపోతారు. కాబట్టి భగవద్భక్తులు కావాలి అనుకునే వారు సద్గురువులను ఆశ్రయించితే శంఖ,చక్ర ముద్రలు భుజములపై వేస్తారు.

పైగా ఈ ఆయుధములు అచేతనం కాదు. వాటిని అధిష్టించి దేవతలు ఉంటారు. కాబట్టి అట్టి మహిమగల శంఖమును నేను ఎల్లప్పుడు శరణు వేడుచున్నాను అని భావము. **(మరికొన్ని విశేషాలు వచ్చే సంచికలో)**

# అఖిల భువన జన్మ...

(19 వ పేజీ తరువాయి) రూపంగా పరమాత్మ రక్షించవచ్చు, అవతారాదిరూపంలో రక్షించవచ్చు, దిక్పాలకుల రూపంలో రక్షించవచ్చు, మన్వాది రాజుల రూపంలో రక్షించవచ్చు, మాతా పితరుల రూపంలోనూ రక్షించవచ్చు స్థేమ అనగా రక్షణ.

భంగం అనగా లయం ఇది మూడు రకములు నిత్యం, నైమిత్తికం, ప్రాకృతికం ఇవన్నీ భగవంతునికి లీలా అన్నారు. శ్రమ పడకుండా, విలాసంగా, అనాయాసంగా చేసే మహానుభావుడు. లీల అను పదం చేత మనకు ఏమి తెలుస్తుంది అనగా, **"అప్రమేయః అనియోజ్యశ్చ యత్ర కామగమో వశీ మోదతే భగవాన్ భూతైః బాలః క్రీడనకైరివ"** అంటారు. పరమాత్మ సంపూర్ణమైన వాడు, కొరత లేని వాడు. ఆయనను నియమించే వారు లేరు. ఆయనే అందరినీ నియమిస్తాడు. ఇష్టం వచ్చినట్టు సంచరించే వాడే తప్ప ఈ ప్రకృతికి లోబడో, కర్మకు లోబడో మనలాగా ప్రవర్తించేవాడు కాదు. అన్నింటినీ తన వశంలో ఉంచుకున్న మహానుభావుడు మనవలె ఇంద్రియవశుడు కాదు. కామ క్రోధాలకు వశమై ప్రవర్తించువాడు కాదు. అటువంటి పరమాత్మ భూతముల చేత ఆడుకుంటాడట! "బాలః క్రీడనకైరివ" అని బొమ్మల చేత పిల్లవాడు ఆడుకున్నట్లుగా అని ఒక దృష్టాంతం చెప్తారు.

అఖిల భువన జన్మ స్థేమ అనునవి అన్ని పరమాత్మకు ఆనందావహమైనవి. దీని ద్వారా పరమాత్మకు ఉండే అసాధారణ లక్షణమైన పరత్వాన్ని నిరూపించి నట్లయినది. అంతటి పరమాత్మతో మనకు సంబంధం ఎలా కుదురుతుంది? అనేదానికి రెండో పాదంలో పరమాత్మ యొక్క సౌలభ్యం చెప్పబడుతుంది. (మిగతా **వచ్చే సంచికలో)**

# నవరాత్రి ఉత్సవాల్లో దుర్గా పూజలు






బీర్పూర్ లో





గోధూరు లో

# శ్రీసన్నిధానం సంపాదకులకు సమ్మానము

విశ్వ జ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ వారు వరంగల్లో అక్టోబర్ 1న వైదిక జ్యోతిష సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులను సత్కరించి పురస్కారాలను అందజేశారు. శ్రీసన్నిధానం గౌరవ సంపాదకులు ఉభయ వేదాంత పండితులు శ్రీమాన్ అమరవాది వెంకటనరసింహాచార్యులు వారికి గౌరవ డాక్టరేట్ పురస్కారాన్ని అందజేశారు. ఇదే కార్యక్రమంలో శ్రీసన్నిధానం పత్రిక చీఫ్ ఎడిటర్ శ్రీమాన్ వొద్దిపర్తి రామచంద్ర మూర్తి గారికి వైదిక సేవారత్న పురస్కారాన్ని అందజేశారు. అదేవిధంగా యాజ్ఞికపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీమాన్ పి టి జి ఎస్ కిషోర్ స్వామి వారికి జ్యోతిష రత్న పురస్కారాన్ని అందచేశారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీ పొడిచేటి సీతారామానుజాచార్యులు, జ్యోతిర్మణి శ్రీ గొడవర్తి సంపత్‌కుమార్ అప్పలాచార్య గారు, శ్రీ కంచి కామకోటి సర్వజ్ఞ పీఠ ఆస్థాన సిద్ధాంతి శ్రీ లక్కా వఝుల విజయ సుబ్రహ్మణ్య సిద్ధాంతి గారు మొదలగు వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన గోష్టి కార్యక్రమంలో వైదిక జ్యోతిష విషయాలపై వక్తలు ఉపన్యసించారు. సమావేశంలో పలువురు పండితులకు పురస్కారాలు అందించి సన్మానించారు.




# ఆధ్యాత్మిక వార్తలు

సైదాబాద్ రామాలయంలో శరన్నవరాత్ర్యుత్సవాలలో ప్రవచనాలు అనుగ్రహించిన ఉభయవేదాంత పండితులు.





దసరా సందర్భంగా వివిధ ఆలయాల్లో ఉత్సవాలు జగిత్యాల జిల్లా మెట్పల్లి చెన్నకేశవ స్వామి, గోదూర్‌లో వెంకటేశ్వర స్వామి సేవ.







## ఇతిహాస పురాణ దివ్య ప్రబంధములపై ప్రత్యేక విద్వత్ సదస్సు

ఇతిహాస పురాణ దివ్య ప్రబంధములపై సదస్సు. తిరుమల తిరుపతి దేవస్థానాలకు చెందిన ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, ఉభయ వేదాంత పండిత పరిషత్, భాగ్యనగర్ శాఖ, శ్రీ వైష్ణవ సేవా సంఘం తెలంగాణ, హైదరాబాద్ సంయుక్త నిర్వహణలో ప్రత్యేక విద్వత్ సదస్సును సెప్టెంబర్ 30 అక్టోబర్ 1, 2 తేదీలలో సైదాబాద్ కాలనీలో వైభవంగా జరిగాయి.





## సత్సంప్రదాయ పరిరక్షణ సభ ట్రస్ట్ వరంగల్ నిర్వహణలో

సత్ సంప్రదాయ పరిరక్షణ సభ ట్రస్ట్ వరంగల్ వారి నిర్వహణలో నవంబర్ రెండు మూడు నాలుగు తేదీలలో సాయంత్రం ఐదు గంటల 45 నిమిషాల నుండి 8 గంటల 30 నిమిషముల వరకు హనుమకొండలో ఉభయ వేదాంత సభలు నిర్వహింపబడుతున్నాయి వేదిక: శ్రీ సీతారామచంద్ర ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం బాలసముద్రం హనుమకొండ.

సత్సంప్రదాయ పరిరక్షణ సభ ట్రస్ట్ వరంగల్ నిర్వహణలో శ్రీ వైష్ణవ సేవా సంఘం తెలంగాణ, ఆచార్య ఫౌండేషన్ వారి సౌజన్య సహకారంతో భగవద్విషయ సభలు, వరిష్ట విద్వదర్చనం కార్యక్రమము తేదీ అక్టోబర్ 29 ఆదివారము రోజున నిర్వహించబడింది

వేదిక: శ్రీ వైష్ణవ సేవా సదనము చంద్రపురి కాలనీ

## ఆహ్వానము

**సర్వవైదిక సంస్థానమ్ ట్రస్టు**

యజ్ఞవరాహక్షేత్రమ్, కరీంనగరమ్

మరియు

**సత్సంప్రదాయ పరిరక్షణ సభ ట్రస్టు**

వరంగల్

సంయుక్త నిర్వహణలో

తేది: 5-11-2023 ఆదివారం

ఉదయం 10 గంటల నుండి 12.30 వరకు

యజ్ఞవరాహక్షేత్రంలో

**ఉభయ వేదాంత సభ**

ప్రవచన కర్తలు:

**ఉ.వే. ప్ర. శ్రీమాన్ కె. ఇ. స్థలశాయిస్వామి**

స్థానాచార్యులు, భద్రాద్రి దేవస్థానం

అంశం: శ్రీ వైష్ణవ సంప్రదాయము-ఆళ్వారులు, ఆచార్యులు

**ఉ.వే.ప్ర. శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్యస్వామి**

ప్రధాన కార్యదర్శి, సత్సంప్రదాయ పరిరక్షణ సభ ట్రస్టు, వరంగల్

అంశం: మంగళాశాసన కృత్య ప్రాశస్త్యమ్